ప్రభుత్వం ఉచితంగా స్థలాన్ని అందించడంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు, తక్కువ ధరలకు నిర్మాణ సామగ్రి సమకూరుస్తుండగా కొందరు నిరుపేద లబ్ధిదారులు ఇంటి నిర్మాణానికి సంకోచించారు. దీంతో వీరి కోసం ప్రభుత్వమే ఇంటిని నిర్మించి ఇచ్చే ఆప్షన్-3ని ప్రవేశపెట్టారు. 3.27 లక్షల మంది లబ్ధిదారులు ఈ ఆప్షన్-3 ఎంచుకున్నారు. లబ్ధిదారులను గ్రూపులుగా చేసి, వారికి లాభాపేక్ష లేని నిర్మాణ సంస్థలను ఎంపిక చేసి అనుసంధానించడం ద్వారా ఆప్షన్-3 ఇళ్లను నిర్మిస్తున్నారు. 3.03 లక్షల ఇళ్లు పునాది, ఆపై దశలో నిర్మాణంలో ఉన్నాయి. 1,923 ఇళ్లు లింటెల్ లెవెల్, 12,252 ఇళ్లు స్లాబ్ దశలో నిర్మాణంలో ఉన్నాయి.

షీర్ వాల్ టెక్నాలజీతో చకచకా

నా భర్త హోల్‌సేల్ మెడికల్ షాపులో సేల్స్‌మెన్‌గా చేస్తారు. చాలా ఏళ్లుగా అద్దె ఇంట్లోనే ఉంటున్నాం. గతంలో ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకున్నా రాలేదు. ఈ ప్రభుత్వం వచ్చాక వెంటనే స్థలం మంజూరు చేయడంతో పాటు ఇంటి నిర్మాణానికి అనుమతులిచ్చారు. నా భర్త పనిచేసే చోట పెద్దగా సెలవులివ్వరు. నేను ఇంటి వద్ద చిన్న వ్యాపారం చేస్తుంటా. మాకున్న ఇబ్బందుల దృష్ట్యా ప్రభుత్వమే ఇంటిని నిర్మించి ఇవ్వాలని కోరాం. షీర్‌వాల్ టెక్నాలజీ విధానంలో మా ఇంటిని నిర్మిస్తున్నారు. స్లాబ్ అయిపోయింది. వేగంగా ఇంటి నిర్మాణం పూర్తవుతోంది. ఈ జన్మకు సొంతిల్లు అనేది ఉంటుందో ఉండదోనని ఆవేదన చెందేవాళ్లం. ముఖ్యమంత్రి జగన్ మా కలను నెరవేర్చారు. నా బిడ్డ చదువు కోసం అమ్మ ఒడి కింద సాయం కూడా అందిస్తున్నారు. ఇంకా పలు రకాలుగా ప్రభుత్వం మాకు అండగా నిలుస్తోంది.

– జి.శోభారాణి, ఆప్షన్-3 లబ్ధిదారురాలు, అమలాపురం, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

వివక్ష లేకుండా మంజూరు

గత ఏడాది డిసెంబర్ 15న ప్రభుత్వం ఇచ్చిన సొంతింటికి మారాం. కరెంట్, నీటి కనెక్షన్.. ఇలా అన్ని వసతులనూ కల్పించారు. వ్యవసాయ కూలీ కుటుంబానికి చెందిన నేను గత ప్రభుత్వంలో ఇంటి పట్టా కోసం దరఖాస్తు చేసుకున్నా టీడీపీ సానుభూతిపరులకే ఇచ్చారు తప్ప రాజకీయాలతో సంబంధం లేని మాకెవ్వరికీ ఇవ్వలేదు. ఈ ప్రభుత్వం కులం, మతం, పార్టీలు చూడకుండా ఎలాంటి పైరవీలు లేకుండా స్థలం మంజూరు చేసింది. ఇంటిని కూడా నిర్మిస్తున్నారు.

– ఎం.హరిత, ఆరూరు ఎస్టీ కాలనీ, నింద్ర మండలం, చిత్తూరు జిల్లా

అంతా కలలా.. ఆర్నెల్లలోనే

నాకు 11 ఏళ్ల క్రితం పెళ్లయింది. అద్దె ఇంట్లో ఉండేవాళ్లం. వడ్రంగి పని చేసే నా భర్త సంపాదనతో కుటుంబ పోషణే భారంగా ఉండేది. గత ప్రభుత్వ హయాంలో తహశీల్దార్ ఆఫీస్ చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ఇంటి స్థలం రాలేదు. ఈ ప్రభుత్వం వచ్చాక వలంటీర్ ఇంటి వద్దకే వచ్చి దరఖాస్తు తీసుకున్నారు. కొద్ది రోజులకే స్థలం మంజూరైంది. ఆర్నెల్లలో సొంతిల్లు కట్టుకున్నాం. అంతా కలలా ఉంది. సొంతింట్లో ఉంటున్నామంటే నాకే నమ్మకం కలగటం లేదు.

– నాగేశ్వరమ్మ, శనివారపుపేట జగనన్నకాలనీ ఏలూరు

రూ.9 లక్షల విలువైన స్థలం ఇచ్చారు


మా గ్రామం జాతీయ రహదారి 26ని ఆనుకుని ఉండటంతో సెంట్ స్థలం రూ.8 లక్షల నుంచి రూ.9 లక్షలు పలుకుతోంది. అంత విలువైన స్థలాన్ని ప్రభుత్వం మాకు ఉచితంగా ఇచ్చింది. నిర్మాణం పూర్తవడంతో గత ఫిబ్రవరిలో గృహ ప్రవేశం చేసి సొంతింట్లో ఉంటున్నాం.


– బోడసింగి సీత, బోడసింగి పేట గ్రామం, బొండపల్లి మండలం, విజయనగరం జిల్లా

జగనన్న కాలనీల్లో శాశ్వత సదుపాయాల కల్పన వ్యయం రూ.కోట్లలో	
నీటి సరఫరా	4,128
విద్యుత్, ఇంటర్నెట్	7,989
డ్రైనేజీ, సీవరేజ్	7,227
రోడ్లు, ఆర్చ్‌లు	10,251
పట్టణ ప్రాంత లేఅవుట్‌లలో వసతుల కల్పన	3,314

ఇళ్ల నిర్మాణ పురోగతి ఇలా	
బేస్మెంట్ లెవెల్ లోపు	9,56,725
బేస్మెంట్ లెవెల్	3,44,512
రూఫ్ లెవెల్	78,366
రూఫ్ కాస్ట్	48,792
నిర్మాణం పూర్తయినవి	3,37,631

● ఈ నాలుగేళ్లలో..



అప్పుడు కాదు.. ఇప్పుడు లక్షల ఇళ్లు

టిడ్కో ఇళ్లపై చంద్రబాబు అడ్డగోలుగా దుష్ప్రచారం.. ఒక్క చోట సెల్ఫీ దిగి.. అన్నీ మేమే కట్టించామంటూ అబద్ధాలు

- అప్పట్లో కమీషన్లు దండుకోవడానికి భారీగా నిర్మాణ ఖర్చు
- ఒక్క చోటా ఒక్క రోడ్డు వేయని వైనం
- నీళ్లు లేవు.. విద్యుత్ లేదు.. ఏ సౌకర్యం కల్పించలేదు
- పైగా ఒక్కో లబ్ధిదారుడిపై చంద్రబాబు రూ.7.5 లక్షలు భారం
- వైఎస్ జగన్ ప్రభుత్వం రాగానే రివర్స్ టెండరింగ్ ద్వారా తగ్గింపు
- కేవలం రూ.1తో అక్కచెల్లెమ్మల పేరుతో రిజిస్ట్రేషన్
- నెల్లూరులో నాడు ఏడు చోట్లకు గాను ఒక్క చోటే అదీ అసంపూర్తిగా నిర్మాణం
- 2019 ఎన్నికల ముందు హడావుడిగా ప్రారంభించి లబ్ధి పొందే వ్యూహం
- మిగతా ఆరు చోట్ల పూర్తి స్థాయిలో ఇళ్లు నిర్మించిన ప్రస్తుత ప్రభుత్వం

రాష్ట్రంలో టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టిన ఏ ఒక్క చోట చంద్రబాబు హయాంలో ఒక్క రోడ్డు వేసిన పాపాన పోలేదు. విద్యుత్ సౌకర్యం కల్పించడం కోసం స్తంభాలు కూడా పాతలేదు. మంచి నీటి కుళాయిల ఊసే లేదు. చాలా వాటికి దారి కూడా సరిగా లేదు. సగం ఇళ్లకు పునాదులు కూడా వేయలేదు. అయినా అన్నీ పూర్తయిపోయాయని ఎలా చెబుతున్నారు? అలాంటి చోట మనుషులనే వారు ఎలా నివశిస్తారు చంద్రబాబూ? ఇవన్నీ విస్మరించి తగుదునమ్మా అంటూ.. ఇప్పుడు ఈ ప్రభుత్వం పూర్తి చేసిన ఇళ్ల వద్ద నిస్సిగ్గుగా సెల్ఫీ దిగడం మీకే చెల్లింది.

సాక్షి, అమరావతి: నిజాలు చెప్పాలన్నా, చూపించాలన్నా ఆధారాలు కావాలి.. అయితే టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుకు మాత్రం అవేవీ అక్కర్లేదు. చీమ దూరేంత సందు ఉంటే చాలు.. అందులోంచి ఏనుగు వెళ్లిందని జనాన్ని నమ్మించడానికి ఏమాత్రం వెనుకాడరు. ఇందుకు టిడ్కో ఇళ్ల నిర్మాణమే ప్రత్యక్ష ఉదాహరణ. జనం ఏమనుకుంటారోనన్న ఆలోచన ఇసుమంతైనా లేకుండా కళ్లార్పకుండా అబద్ధం చెప్పేస్తుండటం ఆయనకే చెల్లింది. ప్రజలకు అన్ని విధాలా మంచి చేస్తున్న వైఎస్ జగన్ ప్రభుత్వంపై నిత్యం బురద చల్లుతూ రాగం తీస్తే.. దానికి ఎల్లో మీడియా తాళం వేస్తుంది. పట్టణ పేదల కోసం రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న టిడ్కో ఇళ్లపై తాజాగా సోషల్ మీడియా వేదికగా విష ప్రచారానికి తెరతీశారు. వాస్తవానికి అప్పట్లో కమీషన్లు దండుకోవడమే లక్ష్యంగా బాబు అడుగులు ముందుకు వేశారు. ఇందులో నిజానిజాలు ఇలా ఉన్నాయి.

బాబు ఆరోపణ

టిడ్కో ఇళ్లన్నీ మా హయాంలో కట్టినవే

వాస్తవం: టిడ్కో ఇళ్ల పేరుతో చంద్రబాబు హయాంలోని అప్పటి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 3,13,832 ఇళ్ల నిర్మాణం తలపెట్టింది. 2019 మే నాటికి 1,22,888 ఇళ్లను పునాదుల్లో, మరో 38,416 యూనిట్లు సగం శాతం కంటే తక్కువ పనులు చేసి వదిలేసింది. చంద్రబాబు ప్రభుత్వం ఇళ్ల నిర్మాణానికి రూ.3,232 కోట్లు ఖరారు చేస్తే, ప్రస్తుత ప్రభుత్వం రివర్స్ టెండరింగ్ ద్వారా దానిని రూ.2,840 కోట్లకు తగ్గించింది. అంటే రూ.392 కోట్ల ప్రజాధనం ఆదా చేసింది. దీనికి తోడు 1,33,480 యూనిట్లను నూరు శాతం పూర్తి చేయడంతో పాటు ఇప్పటికే 48,416 ఇళ్లను లబ్ధిదారులకు అందజేసింది. మరో 40 వేల టిడ్కో ఇళ్లను రెండు నెలల్లో ఇచ్చేందుకు సిద్ధం చేస్తోంది.

బాబు ఆరోపణ

అంతటా అవినీతే

వాస్తవం: పట్టణ పేదలు 300 చ.అ. ఇల్లు పొందాలంటే చంద్రబాబు ప్రభుత్వం రూ.7.5 లక్షలు భారం మోపింది. అదీ 20 ఏళ్లపాటు వాయిదాలు కట్టేలా షరతు పెట్టింది. కానీ, వైఎస్ జగన్ ప్రభుత్వం అదే పేదలకు 1.43 లక్షల టిడ్కో ఇళ్లను రూ.1కే ఇస్తోంది. పైగా ఇళ్లను అక్క చెల్లెమ్మల పేరిట ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి ఇస్తోంది. 365 చదరపు అడుగుల్లో నిర్మించే 44,304 యూనిట్లకు, 430 చదరపు అడుగుల్లో నిర్మించే 74,312 యూనిట్లకు గత ప్రభుత్వం లబ్ధిదారుల వాటా కొంత మొత్తం చెల్లించాలని చెప్పింది. అయితే, ఆ వాటాను ప్రస్తుత ప్రభుత్వం 50 శాతానికి తగ్గించింది.

బాబు ఆరోపణ

నెల్లూరులో మేమే అన్ని ఇళ్లు నిర్మించాం

వాస్తవం: చంద్రబాబు హయాంలో నెల్లూరులో మొత్తం ఏడు ప్రాంతాల్లో టిడ్కో గృహాలను నిర్మించాలని భావించారు. అలిపురంలో 11,376 ఇళ్లు, అక్కచెరువుపాడులో 3,696, కల్లూరుపల్లిలో 2,496, కొండలపూడి ఫేజ్-1, 2లో 2,496, వెంకటేశ్వరపురం ఫేజ్-1లో 4,800, వెంకటేశ్వరపురం ఫేజ్-2లో 3,024, ఇరుకులమ్మ టెంపుల్ ఫేజ్-2లో 48 ఇళ్లు నిర్మించాలని తలపెట్టారు. ఇందులో కేవలం వెంకటేశ్వరపురం ఫేజ్-1లో చేపట్టిన ఇళ్లలో కొన్ని మాత్రమే చంద్రబాబు హయాంలో నిర్మాణాలు పూర్తయ్యే దశకు చేరుకున్నాయి. మిగిలిన ఆరు ప్రాంతాల్లోనూ పనులు పూర్తిగా వదిలేశారు. ఎన్నికలకు రెండు నెలల ముందు టీడీపీ 'షో'లో భాగంగా వెంకటేశ్వరపురం ఫేజ్-1 నివాస సముదాయాలను ప్రారంభించారు. వాటికి తాగునీరు, విద్యుత్, రోడ్లు వంటి ఎలాంటి మౌలిక వసతులు కల్పించకుండానే హడావుడిగా ప్రారంభోత్సవం చేశారు. అందువల్లే ఒక్క కుటుంబం కూడా అక్కడ దిగలేదు. ఇప్పుడు వాటన్నింటినీ దాచిపెట్టి చంద్రబాబు సెల్ఫీతో రాజకీయం చేస్తున్నారు. ఒక్క చోట ఫొటో దిగి..ం 'మొత్తం నేనే కట్టేశా'నని చెప్పుకోవడం చూసి నెల్లూరు వాసులు ఇదేం రాజకీయం అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు. ఏడు ప్రాంతాల్లోని టిడ్కో ఇళ్ల కోసం ప్రస్తుత ప్రభుత్వం రూ.628.5 కోట్లు ఖర్చు చేసింది. పైగా ఇక్కడ చంద్రబాబు ప్రభుత్వం చెల్లించని రూ.90 కోట్ల బకాయిలను కూడా ప్రస్తుత ప్రభుత్వమే చెల్లించింది.

దోసులో 2019కి ముందు..



దోసులో 2019 తరువాత..



విశాఖపట్నం అచ్చంనాయుడు లోవలో ఇళ్ల పరిస్థితి..



నాడు



నేడు

క్లుప్తంగా...

శ్రీపద్మావతి అమ్మవారి సేవలో ప్రముఖులు



ధ్వజ స్తంభానికి మొక్కుతున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు శ్రీప ద్మావతి అమ్మవారిని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి శనివారం దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జాయిం ట్ కలెక్టర్ బాలాజీ, టీటీడీ జేఈవో వీర బ్రహ్మం స్వాగతం పలికారు. అలాగే అమ్మ వారిని యాంటీ టెర్రరిజం ఫ్రంట్ చైర్మన్ మణిందర్ సింగ్ బిట్టా దర్శించుకున్నారు. అనంతరం వీరికి వేద పండితులు ఆశీర్వచనం ఇచ్చి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

శ్రీశైలంలో పోటెత్తిన భక్తులు

మూడు రోజుల పాటు ఆర్జిత అభిషేకాలు తాత్కాలికంగా నిలుపుదల



భక్తులతో కిటకిటలాడుతున్న క్యూలైన్


శ్రీశైలం టెంపుల్: శ్రీశైల మహాక్షేత్రానికి భక్తులు పోటెత్తారు. వరుస సెలవుల నేపథ్యంలో శ్రీభ్ర మరాంబ మల్లికార్జున స్వామివార్ల దర్శనార్థం వచ్చిన భక్తులతో శ్రీశైలక్షేత్రంలోని పుర వీధులు, ఆలయ క్యూలైన్లు శనివారం కిక్కిరి శాయి. భక్తుల రద్దీ దృష్ట్యా గర్భాలయ అభిషే కాలు, సామూహిక అభిషేకాలను మూడు రోజుల పాటు తాత్కాలికంగా రద్దు చేశారు. వేకువ జామునే పవిత్ర పాతాళగంగలో పుణ్య స్నానాలాచరించడానికి తరలి రావడంతో పా తాళగంగ స్నాన ఘట్టాలు కిటకిటలాడా యి. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, తది త ర రాష్ట్రాల నుంచి భక్తులు శ్రీశైలం చేరుకున్నారు.

తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

శ్రీవారి దర్శనం కోసం 40 గంటలు



తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగు తోంది. శనివారం ఔటర్ రింగ్ రోడ్డు, శిలా తోరణం వరకు క్యూలు కిక్కిరిసిపోయాయి. వరుస సెలవులకు వారాంతపు రద్దీ తోడవడం తో మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద భవనం, తిరుమలలోని అన్నప్రసాద కౌంటర్లు, నారాయణగిరి ఉద్యానవనాలలో భక్తుల రద్దీనెలకొంది. రద్దీ అధికంగా ఉండే ప్రాంతాలలో ఆహారం, పాలు, తాగు నీరు అం దించేందుకు టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేపట్టిం ది. మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్ర సాద సముదాయంలోనే మధ్యాహ్నానికి దాదాపు 79 వేల మందికి పైగా అన్న ప్రసాదం అందించగా, వైకుంఠం క్యూ కాంప్లెక్స్ క్యూలై న్లలో 80 వేల మందికి అన్నప్రసాదాలు (ఇం దులో ఉప్మా, పొంగల్ ఉన్నాయి) పంపిణీ చేశారు. శనివారం సాయంత్రం 5 గంటల వరకు దాదాపు 50 వేల మంది యాత్రికులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల అధిక రద్దీ కారణంగా రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టోకెన్లు, ఎస్ఎస్‌డీ టోకెన్లు, దివ్య దర్శనం టోకెన్లు కలిగిన భక్తులు మాత్రమే తిరుమలకు రావాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది. కాగా, తిరుమల శ్రీవారిని శుక్రవారం 71,782 మంది దర్శించుకున్నారు. హుండీలో రూ.3.28 కోట్లు వేశారు. శ్రీవారి దర్శనానికి 40 గంటల సమయం పడుతోంది.



ఏడాది తర్వాత దాపరికాలు బహిర్గతమవుతాయి. వారి అలవాట్లు బయటపడ తాయి. ప్రేమికులు వాస్తవ ప్రపంచంలోకి వస్తారు. తమ పాత అలవాట్లు వెల్లడవు తాయి. దాంతో వారు ఇంతకు ముందు సహించిన విషయాలతో విభేదించడం ప్రారంభిస్తారు. ప్రేమలో ఉన్నప్పుడు వ్యక్తి ఎంత నిజాయితీగా ఉన్నారో తెలుసుకో వడానికి కొంత సమయం పడుతుంది. ఒకటీ రెండు పుట్టిన రోజుల తర్వాత తన పట్ల ఉదారంగా లేరని గ్రహించి ప్రేమికులు బ్రేకప్‌లు చెప్పుకొంటున్నారు..

– డేవిడ్ మెక్‌క్యాండ్‌లెస్, సామాజిక శాస్త్రవేత్త

అంతా బిల్డప్.. అందుకే బ్రేకప్!

మొదటి ఏడాదిలోనే విడిపోతున్న 70 శాతం జంటలు	తొలినాళ్లలో ఎదుటి వారికి నచ్చేట్టుగా ప్రవర్తన	ఆ తర్వాత అసలు మనిషి బయటకు..

అమెరికా, యూరోప్‌లో మానసిక, సామాజిక శాస్త్రవేత్తల అధ్యయనంలో వెల్లడి

సాక్షి, అమరావతి: రోజ్– జాక్ ప్రేమించుకున్నారు. ఒకరికోసం ఒకరు అన్నట్టుగా ఉండేవారు. కాలే జీలో, బయట ఆ జంట గురించే చర్చ. ప్రేమికులం టే అలా ఉండాలని అందరూ చెప్పుకొనేవారు. ఏడాది గడిచింది. అదే జాక్– రోజ్.. జాక్ ఎదురుపడితే రోజ్ మొహం తిప్పుకొంటోం ది. అతడూ తక్కువేం కాదు. ఆమెను చూడగానే గుడ్లురిమి చూస్తున్నాడు. ఒకరి కోసం ఒక రుగా ఉన్న జంట.. ఇప్పుడు ఉప్పు–నిప్పులా మారిపోయింది. ఎం దుకిలా జరిగిందని అడిగితే 'నిజం తెలిసిం ది' అన్నది ఇద్దరి సమాధానం. యూఎస్, యూరప్ దేశాల్లోని ప్రేమ జంటల్లో 75 శాతం మొదటి సంవత్సరంలోనే విడిపోతున్నాయి. 20–25 శాతం మంది మాత్రం తమ ప్రేమను నాలుగైదేళ్ల పాటు కాపాడుకుంటున్నారు. పదేళ్ల పాటు కలిసున్న జంటలు చాలా అరుదు అని సామాజిక, మానసిక శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఎంతో గాఢంగా ప్రేమించుకున్నవారు ఒకటి లేదా రెండేళ్లలోనే ఎందుకు విడిపోతున్నారు? కారణా లేంటి? అన్న అంశాలపై స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ సోషియాలజిస్ట్ మైఖేల్ రోసెన్‌ఫెల్డ్, మానసిక చికిత్స నిపుణుడు డాక్టర్ బార్టన్ గ్లాడ్‌స్మిత్‌లు వేర్వేరుగా సుదీర్ఘకాలం అధ్యయనం చేశారు. వీరు 2009 నుంచి 2022 వరకు దాదాపు 3000 జంట లపై చేసిన పరిశోధనల్లో విడిపోయేందుకు కీలకం గా మారిన అంశాలను గుర్తించారు.



5 నుంచి 10 శాతం జంటలే పెళ్లివరకూ..

ప్రేమపై భారతీయ యువతీ యువకుల అభిప్రాయాలు తెలు సుకునేందుకు సోషల్ నెట్‌వర్క్ యాప్ 'బంబుల్' సర్వే చేపట్టిం ది. దీనిప్రకారం వయసు, విద్య, సామాజిక నేపథ్యం, సాం స్కృతిక వ్యత్యాసాలు, ఆర్థిక స్థిరత్వం వంటి అంశాలకు యువత అధిక ప్రాధాన్యం ఇచ్చిందని వెల్లడించింది. వీటిని దాటుకుని ముందుకు సాగడం తమవల్ల కాదని 35 శాతం మంది యువకులు గర్ల్‌ఫ్రెం డ్ అనే మాటకు దూరంగా ఉన్నారు. దాదాపు 50–55 శాతం మంది 'జస్ట్ ఫ్రెండ్స్'గానే ఉన్నామని వెల్లడించారు. ప్రేమించుకున్న జంటల్లో కేవలం 5 నుంచి 10 శాతం మాత్ర మే పెళ్లి వరకూ వెళుతున్నట్టు వెల్లడైంది.

మొదట్లో భాగస్వామి కోరుకున్నట్టుగా..

ప్రేమలో పడినప్పుడు తమ వ్యక్తిత్వాన్ని ఉన్నది ఉన్నట్టుగా ఎవరూ చూపరు. తన భాగస్వామి ఏం చూడాలనుకుంటున్నారో దాన్ని మాత్రమే చూపి స్తారు. ఒక విధంగా ఇది 'నటన'తో కూడి ఉంటుం దని మైఖేల్ పేర్కొన్నారు. 'ప్రేమ భావాలు మెద డులోని క్లిష్టమైన ఆలోచనలను నియంత్రిస్తాయి కాబట్టి.. మనం ఒక వ్యక్తితో సన్నిహితంగా ఉన్న ప్పుడు వారి ప్రవర్తన లేదా వ్యక్తిత్వాన్ని లోతుగా అంచనా వేయాల్సిన అవసరం లేదన్నట్టుగా ప్రేమి కుల మెదడు నిర్ణయిస్తుంది. అందువల్ల తొలినా ళ్లల్లో ప్రేమికుల వ్యక్తిత్వం వాస్తవానికి భిన్నంగా ఉంటుందంటున్నారు. ఏడాది గడిచాక దాచిపెట్టిన వ్యక్తిత్వం బయటపడుతుంది.. ఆ సమయంలోనే విడిపోయే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ప్రేమి కుల రోజు, వసంతకాలం, ఏప్రిల్ ఫూల్స్ డే, వేసవి సెలవులు, క్రిస్మస్, క్రిస్మస్ రోజుకు రెండు వారాల ముందు, సోమవారాల్లో బ్రేకప్‌లు తరచుగా జరు గుతున్నాయని మరో సామాజిక శాస్త్రవేత్త డేవిడ్ మెక్‌క్యాండ్‌లెస్ తేల్చారు.

దాచాలన్నా దాగవులే..

ప్రేమించిన తొలినాళ్లల్లో తమలో ఉన్న చెడు ప్రవర్తనలు దాచిపెట్టి ఎదుటి వారు కోరుకు న్నట్టు ఉన్న వ్యక్తులు.. ఏడాది లోపే బయట పడిపోతున్నారట. పాత ప్రవర్తనలు ధూమ పానం, మద్యపానం, పొగాకు నమలడం వంటివి ఎదుటి వారికి ఇబ్బందిగా మార డం.. వాటిని మానుకోమని చెప్పడంతో మొదలయ్యే ఘర్షణ బ్రేకప్‌కు దారితీస్తుం దని గుర్తించారు. ముఖ్యంగా చెడు ప్రవర్త నతో పాటు, మోసం, అధిక కోపం, ఎదుటి వారికి అవసరంలో అండగా ఉండకపోవ డం, చెడు సావాసాలు, భాగస్వామి పట్ల నిర్లక్ష్యం, అబద్ధాలు చెప్పడం, కష్టంలో ఉన్నప్పుడు, బయటకు వెళ్లినప్పుడు వది లేసి పోవడం, ఏదైనా విషయాన్ని సరిగా చెప్పకపోవడం వంటివి జంటల మధ్య బీట లుగా మారుతున్నాయని తేల్చారు. వీటిలో ఏ ఒక్క లక్షణం ఉన్నా జంటల మధ్య మం ట తప్పదని స్పష్టం చేశారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు 'ఎస్‌బీసీసీ'

- ప్రతి జిల్లాలోనూ సామాజిక, ప్రవర్తన మార్పు సమాచార కేంద్రం
- అన్ని రాష్ట్రాల కంటే ఏపీ ముందడుగు
- గతేడాది నీతి ఆయోగ్ ప్రశంసలు
- ఈ ఏడాది మూడు నెలల్లోనే 9,194 అవగాహన కార్యక్రమాలు

సాక్షి, అమరావతి: సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో ఏర్పాటు చేసిన సామాజిక, ప్రవర్తన మార్పు సమాచార కేం ద్రాలు(ఎస్‌బీసీసీ) మంచి ఫలితాలు ఇస్తున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి మార్చి నెలాఖరు వరకు మూడు నెలల కాలంలో మొత్తం 9,194 అవగాహన కార్యక్రమాలను నిర్వహించిన ఎస్‌బీసీసీలు సామా జిక చైతన్య వీచికలుగా కీలకపాత్ర పోషిస్తున్నాయి. కోవిడ్ నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా ఎదురైన అను భవాలను దృష్టిలో పెట్టుకుని మానవాభివృద్ధి కోసం ప్రపంచ ఆరోగ్య సంస్థతోపాటు సామాజిక సంస్థలు, సామాజిక పరిశోధకులు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను నిర్దేశించారు. ఈ క్రమంలో ఎస్‌బీసీసీలకు శ్రీకారం చుట్టారు. ఐక్యరాజ్యసమితికి చెందిన యూనిసెఫ్ సహకారంతో ఆ లక్ష్యాల సాధనకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. లక్ష్యాల సాధనకు విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపడు తోంది. ప్రతి జిల్లాలో సామాజిక, ప్రవర్తన మార్పు సమాచార కేంద్రం ఏర్పాటు చేసింది. గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ఆధ్వర్యంలోని ఈ విభాగం కో–ఆర్డినేటర్లు క్షేత్ర స్థాయిలో పర్యటించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జిల్లా కలెక్టర్ చైర్మ న్‌గా వ్యవహరించే ఎస్‌బీసీసీలో జిల్లా వైద్య ఆరోగ్య, విద్యాశాఖ, మహిళా అభివృద్ధి–శిశు సంక్షేమ, డీఆర్ డీఏ, మెప్మా అధికారులతోపాటు ఒక స్వచ్ఛంద సం స్థ ప్రతినిధి, ఎస్‌బీసీసీ జిల్లా కో ఆర్డినేటర్‌లు సభ్యు లుగా ఉన్నా రు. వీరు గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ప్రజలకు పలు కీలక అంశాలపై పెద్ద ఎ త్తున అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

నీతి ఆయోగ్ ప్రశంసలు..

దేశంలో తొలుత ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలం గాణ తదితర రాష్ట్రాల్లో ఎస్‌బీసీసీలను 2021లో ప్రారంభించారు. ఆయా రాష్ట్రాల్లో ప్రభుత్వాలు అంత పటిష్టంగా అమలు చేయలేకపోయినా మన రాష్ట్రంలో మాత్రం సుస్థిర అభివృద్ధి లక్ష్యా లను సాధించడానికి సంబంధిత శాఖలను సమ న్వయం చేస్తూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విస్తృ తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోం ది. ఈ విషయమై నీతి ఆయోగ్ గతేడాది జూలై 13న రాష్ట్ర ప్రభుత్వాన్ని అభినందిస్తూ నివేదిక కూడా పంపడం విశేషం. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన కోసం నవరత్నాలతో మిళితం చేసి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడాన్ని నీతి ఆయోగ్ ప్రశంసించింది. ఇం దుకు గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ అద్భు తంగా దోహదం చేస్తోందని పేర్కొంది. 2030 నాటికి ఆకలి లేని సమాజం, ఆరోగ్యం, నాణ్య మైన విద్య, లింగ వివక్ష నిర్మూలన వంటి సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తోంది.

గత మూడు నెలల్లో ఎస్‌బీసీసీల అవగాహన కార్యక్రమాలు ఇలా..

నెల	రక్తహీనత	చేతుల శుభ్రత	బాల్య వివాహాల నిర్మూలన	కిశోర బాలికల గ్రూపుల ఏర్పాటు
జనవరి	1,376	1,318	1,311	1,148
ఫిబ్రవరి	776	719	745	529
మార్చి	1,019	951	979	686
మొత్తం	3,171	2,988	3,035	2,363

గ్రామీణ ఆవిష్కరణలే రక్ష

సాక్షి సాగుబడి, హైదరాబాద్: గ్రామీణ ఆవిష్క రణలే మానవ మనుగడకు రక్ష అని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. జి–20 చర్చాగోష్ఠుల్లో భాగంగా సివిల్ 20–లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్ మెం ట్ వర్కింగ్ గ్రూప్ 'గ్రామీణ ఆవిష్కరణలు–జీవన విధానం' అనే అంశంపై నిర్వహించిన రెండు రోజుల జాతీయ స్థాయి స్వచ్ఛంద సంస్థల సదస్సు శనివారం ముగిసింది.

కుడుముల ఆట.. తన్నులు సేవ

విభిన్నం.. విశిష్టం.. కర్నూలు జిల్లా చిన్నహోత్తూరు పార్వతీ పరమేశ్వరుల కళ్యాణం

- భక్తులను ఆకట్టుకున్న ఆటలు
- ఆనందోత్సాహాల మధ్య వసంతోత్సవం

ఆస్పరి (కర్నూలు): ఒకరిపై ఒకరు కుడుములు విసురుకోవడం, బుక్కాను ఒకరిపై ఒకరు జిమ్ముకో వడం, తన్నించుకోవడానికి ఎగబడటం, నంది కోలు, వసంతోత్సవం.. ఇలా కర్నూలు జిల్లా ఆస్పరి మండలం చిన్నహోత్తూరు గ్రామంలో వెల సిన సిద్ధరామేశ్వరస్వామి ఉత్సవాలు సరికొత్త శోభను సంతరించుకున్నాయి. శనివారం పార్వతీ పరమేశ్వరుల కళ్యాణం కన్నుల పండుగగా జరిగిం ది. ఇందులో భాగంగా కుడుముల ఆట, నంది కోలు, తన్నులసేవ, వసంతోత్సవాలను వైభవంగా నిర్వహించారు. పార్వతీపరమేశ్వరులను ఒక్కటి చేసేందుకు గ్రామస్తులు సంప్రదాయంగా ఆడే ఈ ఆటలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఇందులో భాగంగా అమ్మవారు, అయ్యవారు తరపు ఇరు వర్గాలకు చెందిన పెద్దలు మహిళ వేషంలో ఉన్న వ్యక్తిని శాంతింపజేస్తూ.. అటు ఇటు తిప్పుతూ బుక్కాను ఒకరిపై ఒకరు జల్లుకున్నారు. ఆ తర్వాత ఇరువర్గాల వారు ఒకరిపై ఒకరు కుడుములు విసు రుకున్నారు. ఆ తర్వాత పెళ్లి ఒప్పందం చేసుకు న్నారు. అనంతరం పార్వతీపరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను మేళతాళాలతో ఊరేగించారు. పెళ్లి సమయంలో అలిగిన పార్వతీ దేవిని శాంతింపజే యడానికి పరమేశ్వరునిపై కుడుములు వేసి అవ మానించారని గ్రామ పెద్దలు చెబుతారు. అందుకే కుడుముల ఆట ఆడతారు. ఆ తర్వాత దేవాలయం దగ్గర వీరభద్రస్వామి అవతారంలో వున్న పూజారి కుమారస్వామి తలపై తట్ట పెట్టుకుని, త్రిశూలం చేతబూని కేకలు వేస్తూ భక్తులను తన్నుతూ తిర గడం ఆకట్టుకుంది. ఆయన తన్నుల కోసం భక్తులు ఎగబడ్డారు. ఆయనతో తన్నులు తింటే కోరిన కోర్కెలు వీరభద్రస్వామి తీరుస్తాడని భక్తులు నమ్ముతారు. అనంతరం ఉగ్రుడైన వీరభద్రస్వామి అవతారంలో ఉన్న పూజారిని గ్రామస్తులు మిరప కాయల పొగబెట్టి శాంతింపజేశారు. పార్వతీపరమే శ్వరుల పెళ్లి చేసే విషయంలో విఫలమయ్యారని వీరభద్రస్వామి ఉగ్రుడై ఇలా గ్రామ పెద్దలను తం తాడని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఇదే ఆచారాన్ని ఇప్పటికీ పాటిస్తున్నారు.



పార్వతీ పరమేశ్వరుల కళ్యాణం నిర్వహిస్తున్న ఆలయ నిర్వాహకులు



భక్తులను తంతున్న వీరభద్ర స్వామి అవతారంలో ఉన్న పూజారి

గులాబీమయమైన గ్రామం

వివిధ ఉత్సవాల సందర్భంగా ప్రతి గ్రామంలో వసంతోత్సవాల్లో అనేక రకాల రంగులను వాడ తారు. అయితే చిన్నహోత్తూరులో మాత్రం కులమ తాలకతీతంగా ఒకే గులాబీ రంగు (ఎర్ర రంగు అని వాడుకలో ఉంది)ను వినియోగిస్తారు. గ్రామంలో అన్ని వర్గాల వారికి సంబంధించి ఐదు పెద్ద రంగుల గుంతలు ఉన్నాయి. గుంతకో రంగుల కడవను ఆలయానికి తీసుకెళ్లి సిద్ధరామేశ్వర స్వామికి పూజలు చేశారు. ఆ తర్వాత ఒకటి తర్వాత ఒకటి గుంతల్లో ఉన్న రంగును జల్లుకుంటూ గ్రామస్తులు గ్రామమంతా కలియదిరిగారు. పార్వతీ, పరమేశ్వరుల పల్లకీ సిద్ధ రామేశ్వర స్వామి ఆలయం చేరాక వసంతోత్సవాన్ని ముగించారు. కార్యక్రమంలో సర్పంచ్ హరికృష్ణ, గ్రామ పెద్దలు మంజునాథ్‌గౌడ్, వీరభద్రగౌడ్, బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలు



ఒంటిమిట్ట: వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్ట ఏకశిలానగరిలో కోదండ రామస్వామి బ్రహ్మో త్సవాలు ముగిశాయి. తొమ్మిదో రోజు శనివారం రాత్రి రుత్వికులు శాస్త్రోక్తంగా ధ్వజా వరోహణం నిర్వహించారు. ఆలయ డిప్యూటీ ఈవో నటేష్ బాబు పూజా సామ గ్రిని సమర్పించారు. కంకణదారు రాజేష్ భట్టార్ ఆధ్వర్యంలో యాగశాలలో హోమాలు నిర్వహిం చారు. మహాపూర్ణాహుతి, కుంభజల ప్రోక్షణ జరి గాయి. ధ్వజ స్తంభంపై నుంచి గరుడ పతాకాన్ని కిందకు దించారు. కలశాలను కోదండ రామయ్యకు సమర్పించారు. తొలుత ఉదయం బ్రహ్మోత్సవాల ముగింపు దశలో కీలకమైన చక్రస్నానాన్ని కనుల పండువగా నిర్వహించారు. కాగా, ఆదివారం సాయంత్రం 6 నుంచి పుష్పయాగం జరగనుంది.



ఉద్యోగాల పేరిట కానిస్టేబుల్ మోసం

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల పేరిట టోకరా ● బాధితుల్లో ముగ్గురు కానిస్టేబుళ్లు



నంద్యాల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్

బొమ్మలసత్రం: దొంగలు, నేరగాళ్లను పట్టుకో వాల్సిన ఓ పోలీస్ కానిస్టేబుల్ మోసగాడి అవతార మెత్తాడు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ స్నేహితులు, బంధువులను బురిడీ కొట్టించి భారీ ఎత్తున నగదు తీసుకుని బురిడీ కొట్టించాడు. నం ద్యాల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న కుమ్మరి శివయ్య మోసాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తుండటంతో ఉన్నతాధికారులు సైతం నివ్వెరపోతున్నారు. బాధితుల్లో ముగ్గురు కానిస్టే బుళ్లు కూడా ఉండటం విశేషం. అతడికి రూ.లక్షలు ముట్టజెప్పినా సాఫ్ట్‌వేర్ కొలువులు రాకపోవడంతో బాధితులు పోలీస్ స్టేషన్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తు న్నారు. దాదాపు ఏడాదిగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల పేరిట కానిస్టేబుల్ శివయ్య పలువుర్ని మోసగించి రూ.కోట్లు గుంజినట్టు తెలుస్తోంది.

సోషల్ మీడియాలో ప్రచారం చేసుకుని..

మోసానికి పాల్పడిన కానిస్టేబుల్ శివయ్య తన కుటుంబ సభ్యుల్లో ఒకరికి గత ఏడాది రూ.1.40 కోట్ల ప్యాకేజీతో బెంగళూరులోని ఓ ప్రధాన కంపె నీలో ఉద్యోగం వచ్చినట్టు సోషల్ మీడియాలో ప్రచారం చేసుకున్నాడు. దీనిని నమ్మిన కొందరు నిరుద్యోగులు కానిస్టేబుల్ వద్దకు వెళ్లి తమ పిల్ల లకు మంచి ప్యాకేజీతో ఉద్యోగం కావాలని అడి గారు. రూ.4 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఖర్చవుతుందని చెప్పిన కానిస్టేబుల్ వసూళ్లకు పాల్పడినట్టు తెలుస్తోంది. నంద్యాల పట్టణంలో వివిధ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు కానిస్టేబుళ్లు తమ పిల్లల భవిష్యత్ కోసం కానిస్టేబుల్ శివయ్యను ఆశ్రయించారు. వారినుంచి కూడా రూ.6 లక్షల వరకు వసూలు చేసిన కానిస్టే బుల్ ఉద్యోగం వస్తుందని నమ్మించాడు. ఎన్ని రోజులైనా కంపెనీ నుంచి కాల్ లెటర్ రాకపోవడం తో ముగ్గురు కానిస్టేబుళ్లు నిలదీశారు. విషయం బయటకు పొక్కుతుందని భావించిన కానిస్టేబుల్ వారికి మాత్రం విడతల వారీగా డబ్బు తిరిగి ఇచ్చి నట్టు సమాచారం.

ఫేక్ ఐడీ, వాట్సాప్ నంబర్లతో..

డబ్బులిచ్చిన నిరుద్యోగులకు ప్రముఖ కంపె నీల పేరుతో నకిలీ ఆఫర్ లెటర్లను ఫేక్ మెయిల్ ఐడీ, వాట్సాప్ నంబర్లతో పంపిం చేవాడు. వాటిలో పేర్కొన్న బెంగళూరు, హైదరాబాద్ నగరాల్లోని చిరునామాలకు వెళ్లి చూస్తే అక్కడ కంపెనీలు కనిపించేవి కావు. కొందరు ధైర్యం చేసి కానిస్టేబుల్‌ను నిలదీస్తే వారికి ఎంతో కొంత ముట్టజెప్పి ఫిర్యాదు చేయకుండా ఆపినట్టు తెలుస్తోంది. ఈ విషయం ఉన్నతాధికారులకు తెలియడంతో కానిస్టేబుల్ శివయ్యను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్టు తెలిసింది. ఎంతమంది బాధితులు ఉన్నారు? ఎంత వసూలు చేశా డనే వివరాలు ఆరా తీస్తున్నారు. బాధితులను స్టేషన్‌కు పిలిపించి వివరాలు సేకరిస్తున్నారు.



చట్టపరమైన చర్యలు తీసుకుంటాం

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల పేరుతో కొందరిని కానిస్టేబుల్ మోసం చేసినట్టు తెలిసింది. కానిస్టేబుల్‌ను పిలిచి విచారిస్తున్నాం. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. – రఘువీర్‌రెడ్డి, జిల్లా ఎస్పీ, నంద్యాల

తెలంగాణ

కాబోయే వైద్యులకూ కావాలి వైద్యం!

- దేశవ్యాప్తంగా గత కొన్నేళ్లలో వందలాది మంది మెడికోల ఆత్మహత్యలు
- చదువుల ఒత్తిడి భరించలేక కొందరు.. మనోవేదనతో మరికొందరు బలవన్మరణం
- మధ్యలోనే వైద్య కోర్సులు మానేసిన వారి సంఖ్య వెయ్యిపైనే...
- నేషనల్ మెడికల్ కౌన్సిల్ అధ్యయనంలో వెల్లడి
- ఒత్తిడి, బలహీనతలకు లోనుకావద్దని సూచన



వారంతా స్టెత్‌పట్టి రోగుల నాడి చూడా ల్సిన మెడికోలు... కానీ వారిలో కొందరు మానసిక ఒత్తిళ్లకు చిత్తవుతున్నారు! మనో వేదనను తాళలేక బలవన్మరణాలకు పాల్పడుతున్నారు!! గత కొన్నేళ్లుగా దేశ వ్యాప్తంగా ఈ ధోరణి చోటుచేసుకుంటోం ది. రాష్ట్రంలోనూ ఇటీవల కాలంలో పలు వురు వైద్య విద్యార్థులు ప్రాణాలు తీసుకు న్నారు. భావిభారత వైద్యులకు ఈ పరిస్థితి ఎందుకు తలెత్తుతోంది? అందుకు గల కారణాలు ఏమిటి?

సాక్షి, హైదరాబాద్: జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) చేపట్టిన అధ్యయనం ప్రకారం 2010 నుంచి 2019 మధ్య దేశవ్యాప్తంగా 125 వైద్య విద్యార్థులు, 105 మంది రెసిడెంట్ డాక్టర్లు, 128 మంది వైద్యులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. బలవన్మరణాలకు పాల్పడిన ప్రతి 10 మందిలో ఏడుగురు 30 ఏళ్లలోపు వారేనని అధ్యయనంలో వెల్లడైంది. అలాగే ఉత్తరాదితో పోలిస్తే దక్షిణాదిలోనే (కేరళ మినహా) ఎక్కువ మంది మెడికోల ఆత్మ హత్యలు నమోదయ్యాయని, గత ఐదేళ్లలో 64 మంది ఎంబీబీఎస్, 55 పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికోలు ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఎన్ఎంసీ వెల్లడించింది.

ఒత్తిళ్లు.. విభేదాలు.. అనారోగ్యం..

మెడికోల ఆత్మహత్యలను ఎన్ఎంసీ విశ్లేషిం చగా విస్తుగొలిపే విషయాలు వెల్లడయ్యాయి. మెడికోల ఆత్మహత్యలు ఎక్కువగా జరిగే విభా గాల్లో అనస్తీషియాలజీ (22.4 శాతం) తొలి స్థానంలో నిలవగా ఆ తర్వాత స్థానంలో ప్రసూ తి–గైనకాలజీ (16 శాతం) నిలిచింది. ఆత్మ హత్యలకు పాల్పడుతున్న వైద్య విద్యార్థుల్లో (45.2 శాతం), రెసిడెంట్ డాక్టర్‌లలో (23.1 శాతం) చదువుల ఒత్తిడి కారణమవుతోంది. అలాగే వైద్యుల దాంపత్య జీవితంలో మన స్పర్థలు (26.7 శాతం), మానసిక సమస్యలు (వైద్య విద్యార్థుల్లో 24 శాతం, వైద్యుల్లో 20 శాతం), వేధింపులు (20.5 శాతం) ఆత్మహత్య లకు ఇతర కారణాలుగా నిలిచాయి. ఆత్మహత్యలకు పాల్పడిన వారిలో 13 శాతం మంది గతంలో మానసిక వైద్య సహాయం కోరడం గమనార్హం. ఆర్టీఐ కార్యకర్త వివేక్ పాం డే ఇటీవల అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఈ అధ్యయన ఫలితాల్ని విడుదల చేసింది. మరో వైపు వైద్యవృత్తిలో ఉన్నవారిలో ఆత్మహత్య ప్రమాదం సాధారణ జనాభా కంటే దాదాపు 2.5 రెట్లు ఎక్కువని ఇండియన్ మెడికల్ అసోసియేషన్–జూనియర్ డాక్టర్స్ నెట్‌వర్క్ పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టడీస్ కమిటీ హెడ్ రిమీ డే పేర్కొన్నారు.

చదువుకు గుడ్‌బై చెబుతున్నారు...

దాదాపు అన్ని మెడికల్ కాలేజీల్లో నియమాలు, రక్షణలు సహాయక వ్యవస్థలు ఉన్నప్పటికీ సక్ర మంగా అమలు కావడం లేదని... అందుకే 1,166 మంది విద్యార్థులు వైద్య కళాశాలలకు వీడ్కోలు పలికారని అధ్యయనం తేల్చింది. వారిలో 160 మంది ఎంబీబీఎస్, 1,006 మం ది పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులు చదువుతున్న వారు ఉన్నారు.

ఎన్ఎంసీ కీలక సూచనలివీ...

- వైద్య విద్యార్థులు మాదకద్రవ్యాలు, మద్యం, పొగాకు ఇతర దురలవాట్లకు దూరంగా ఉండాలి.
- సామాజిక మాధ్యమ పరిధి, ఉపయోగంతోపాటు విచక్షణారహిత విని యోగంతో వచ్చే వృత్తిపరమైన ప్రమాదాల గురించి వైద్య విద్యార్థులు తప్పనిసరిగా తెలుసుకోవాలి.
- రోగులతో సమర్థంగా కమ్యూనికేట్ చేయ డానికి స్థానిక భాషను నేర్చుకోవాలి.
- విద్యార్థులు ఎదుర్కొనే ఒత్తిడి, మానసిక అనారోగ్య సమస్యల గురించి ప్రొఫెసర్లు తప్పనిసరిగా తెలుసుకోవాలి.
- వైద్య విద్యార్థుల సమస్యలను పరిష్కరించ డానికి అందుబాటులో ఉన్న పరిష్కార ప్రక్రి యల గురించి అవగాహన పెంచుకోవాలి.

అధ్యయనం జరగాలి...

వెలుగులోకి వచ్చేవి, మీడియాలో చర్చకు నోచుకున్నవే కాదు... బయ టకు రాని మరికొన్ని ఆత్మహత్యల ఉదంతాలూ ఉన్నాయి. ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో నిబంధనల పేరిట విద్యార్థుల్ని విపరీతమైన ఒత్తిడికి లోనుచేస్తున్నారు. ఇక ఆస్పత్రుల్లో 24/7 షిఫ్టులు, క్రమబ ద్ధంగా లేని పనిగంటలు, కుటుం బానికి దూరంగా ఉండటం, ప్రతి కూల పనివాతావరణం, నిద్రలేమి, ఆర్థిక కష్టాలు, పరీక్షల ఒత్తిడి, కొన్నిచోట్ల ర్యాగింగ్, కుల వివక్ష, భవిష్యత్తుపై భయం వంటివి వైద్య విద్యార్థులు ఎదుర్కొంటున్నారు. దీనిపై సమగ్ర అధ్యయనం జరపా లి. వాటిని నివారించే దిశగా కార్యా చరణ రూపొందించాలి.

– డాక్టర్ బీఎస్ రావు, ఐఎంఏ అధ్యక్షుడు

ఒత్తిడి ఉంది...

పరీక్షల దశలోనే ఒత్తిడి బాగా ఉంది. ఇంటర్న్స్, పీజీలకు రెగ్యులర్ డ్యూటీల భారం ఉంటోంది. వాటిని కొందరు తట్టుకోలేకపోతున్నారు. ముఖ్యంగా ప్రభుత్వాస్పత్రుల్లో ఎక్కువ మంది రోగులు, తక్కువ మంది వైద్యులు ఉండటం వల్ల నిర్ణీత పనివేళలు ఉండవు. ఉదయం 9 గంటలకు ప్రారంభమై మరుసటి రోజు సాయంత్రం 6 గంటల వరకూ కొనసాగే పనివేళలు... సర్జ రీల్లో ఉండే వారికి మరింత ఎక్కువ పనిభారం ఉంటోంది.

– డాక్టర్ కౌశిక్ దెర్మా, జూనియర్ వైద్యుల సంఘం అధ్యక్షుడు

క్లుప్తంగా...

వీసా దరఖాస్తు ఫీజులు పెంచిన అమెరికా

న్యూఢిల్లీ: అమెరికాకు వచ్చే వారి టూరిస్ట్, స్టూడెంట్ వీసా దరఖాస్తుల ఫీజును పెంచుతున్నట్లు అమెరికా విదేశాంగ శాఖ తెలిపింది. విజిటర్ వీసాలు, నాన్ పిటిషన్ బేస్డ్ నాన్ ఇమిగ్రాంట్ వీసాల ఫీజును ప్రస్తుతమున్న 160 డాలర్ల నుంచి 185 డాలర్లకు పెంచుతున్నట్లు పేర్కొంది. అదేవిధంగా, తాత్కాలిక వృత్తిదారులు(టెంపరరీ వర్కర్స్)కిచ్చే కొన్ని రకాల నాన్ ఇమిగ్రాంట్ వీసాల ఫీజు ప్రస్తుతం ఉన్న 190 డాలర్ల నుంచి 205 డాలర్లకు పెరుగుతుందని తెలిపింది. ప్రత్యేక వృత్తినిపుణు(స్పెషలిజం ఆక్యుపేషన్)లకు ఫీజును 315 డాలర్లకు పెంచుతున్నట్లు పేర్కొంది. ఈ నిర్ణయం మే 30వ తేదీ నుంచి అమల్లోకి రానుందని ప్రకటించింది. కాన్సులర్ సేవల ఫీజుల్లో ఎటువంటి మార్పులు లేవని స్పష్టం చేసింది.

గాల్లో విమానంలో అనూహ్య ఘటన

బెంగళూరు: మద్యం మత్తులో విమానం అత్యవసర ద్వారం తెరిచేందుకు యత్నించిన ఓ ప్రయాణికుడిని సీఐఎస్ఎఫ్ అదుపులోకి తీసుకుంది. ఢిల్లీ నుంచి బెంగళూరు వస్తున్న ఇండిగో విమానంలో శుక్రవారం ఈ ఘటన చోటుచేసుకుంది. యూపీలోని కాన్పూర్‌కు చెందిన ప్రతీక్(30) ఇండిగోకు చెందిన 6ఈ308 ఢిల్లీ–బెంగళూరు విమానం 18ఎఫ్ సీట్లో కూర్చున్నాడు. విమానం బయలుదేరిన కొద్దిసేపటికి మత్తులో ఉన్న ప్రతీక్ తోటి ప్రయాణికుల పట్ల అమర్యాదకరంగా ప్రవర్తించాడు. అంతటితో ఆగక అత్యవసర ద్వారం తెరిచేందుకు రాగా సిబ్బంది అతడిని వారించారు. వినిపించుకోకపోవడంతో అతడ్ని బలవంతంగా కూర్చోబెట్టారు. విమానం బెంగళూరుకు చేరుకున్నాక పైలట్ అతడిని సీఐఎస్ఎఫ్ సిబ్బందికి అప్పగించారని ఇండిగో ఒక ప్రకటనలో తెలిపింది. ప్రతీక్‌పై ఐపీసీ సెక్షన్లు 290, 336లతోపాటు ఎయిర్‌క్రాఫ్ట్ చట్టంలోని 11(ఏ) కింద కేసులు నమోదు చేసి, అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

మరో 6,155 కేసులు

న్యూఢిల్లీ: దేశంలో 24 గంటల వ్యవధిలో మరో 6,155 కోవిడ్ కేసులు నమోదయ్యాయి. అదేవిధంగా, యాక్టివ్ కేసులు 31,194కు చేరినట్లు కేంద్ర ఆరోగ్య శాఖ శనివారం తెలిపింది. తాజా కేసులతో కలిపి మొత్తం కేసులు 4,47,51,259కు చేరాయి. అదే సమయంలో మరో 11 మంది బాధితులు చనిపోవడంతో మొత్తం మరణాలు 5,30,954కు పెరిగినట్లు వెల్లడించింది. మొత్తం కేసుల్లో యాక్టివ్ కేసులు 0.07% కాగా, రికవరీ రేటు 98.74%గా ఉంది. రోజువారీ పాజిటివిటీ రేటు 5.63గా నమోదైనట్లు ఆరోగ్య శాఖ వివరించింది.

పాత మైసూరు.. కొత్త పోరు

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఇప్పటివరకు సంపూర్ణ మెజార్టీ సాధించలేదు. ఎన్నికలకు ముందు, తర్వాత పెట్టుకొన్న పొత్తులు, స్వతంత్రులపై వల, ఇతర పార్టీల నుంచి ఫిరాయింపుల్ని ప్రోత్సహించడం వంటి వాటితో ప్రభుత్వాలు నడిపింది. దీనికి ప్రధాన కారణం వొక్కలిగ ప్రాబల్య ప్రాంతమైన పాత మైసూరులో పాగా వెయ్యలేకపోవడమే.ఈ సారి ఎన్నికల్లోనైనా పాత మైసూరులో పట్టు బిగించి సంపూర్ణ మెజార్టీ సాధించాలన్న లక్ష్యంతో బీజేపీ విపక్షాలతో అమీతుమీ తేల్చుకోవడానికి సిద్ధపడడంతో ఈ ప్రాంతం కొత్త పోరాటాలకు వేదికగా మారింది.

- కన్నడ ఆత్మగౌరవ నినాదంతో పట్టునిలుపుకునే వ్యూహంలో జేడీ(ఎస్)
- వొక్కలిగ నేతల్ని ఆకర్షించి బలం పెంచుకుంటున్న బీజేపీ
- శివకుమార్, సిద్దరామయ్యలపైనే కాంగ్రెస్ ఆశలు
- కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో పాత మైసూర్‌పైనే అందరి దృష్టి


కాంగ్రెస్‌కు కలిసొస్తుందా..?

ఒకప్పుడు కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉండే పాత మైసూరు ప్రాంతం జేడీ (ఎస్) వచ్చాక క్రమంగా పట్టు కోల్పోతూ వస్తోంది. ఈ ప్రాంత రాజకీయాలను శాసిస్తున్న వొక్కలిగ సామాజిక వర్గీయులు మాజీ ప్రధాని హెచ్.డి.దేవెగౌడను తమకు తండ్రిలా భావిస్తారు. గత ఎన్నికల్లో కూడా ఓల్డ్ మైసూర్ ప్రాంతంలో 66 స్థానాలకు గాను 30 సీట్లు చేజిక్కించుకొని జేడీ(ఎస్) ముందు వరసలో ఉంది. తక్కువ సీట్లు వచ్చినప్పటికీ కింగ్ మేకర్‌గా ఒక పార్టీ చక్రం తిప్పి అధికార అందలాన్ని అందుకుంటుందని పాత మైసూర్‌లో వొక్కలిగలు తమ పొలిటికల్ పవర్ చూపించారు. 224 అసెంబ్లీ స్థానాలున్న రాష్ట్రంలో పాత మైసూరు, బెంగళూరు అర్బన్ కలిపి 89 స్థానాలు ఉన్నాయి. 1983 సంవత్సరం వరకు ఈ ప్రాంతంలో కాంగ్రెస్ ప్రభ వెలిగిపోయింది. జనతా పార్టీ మూలస్తంభాల్లో ఒకరైన మాజీ ప్రధాని హెచ్.డి. దేవెగౌడ వొక్కలిగ సామాజిక వర్గానికి చెందినవారు. తొలిసారిగా రాష్ట్రంలో కాంగ్రెస్‌యేతర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన ఘనత సాధించారు. 1999లో దేవెగౌడ జనతా పార్టీ నుంచి బయటకి వచ్చి జేడీ(సెక్యులర్–ఎస్) స్థాపించిన తర్వాత పోటీ పడలేక క్రమక్రమంగా కాంగ్రెస్ పార్టీ బలహీనపడుతూ వస్తోంది. వొక్కలిగ సామాజిక వర్గీయులు రాజకీయ ప్రయోగాల్ని కూడా ఇష్టపడరు. 2005 సంవత్సరంలో అప్పట్లో జేడీ(ఎస్) నాయకుడిగా ఉన్న కురుబ వర్గానికి చెందిన నాయకుడు సిద్దరామయ్య మైనార్టీలు, వెనుకబడిన వర్గాలు, దళితులతో "అహిందా" అనే కొత్త సామాజిక సమీకరణకు తెరతీశారు. వొక్కలిగ ఓట్లను దూరం చేసుకోవడం ఇష్టం లేని జేడీ(ఎస్) ఆయనను పార్టీ నుంచి బహిష్కరిస్తే కాంగ్రెస్‌లో చేరారు. 2018లో సిద్దరామయ్య తన సొంత నియోజకవర్గమైన చాముండేశ్వరిలో వొక్కలిగ ఓట్లు పడకపోవడంతో ఓటమి పాలయ్యారు. 66 స్థానాలున్న పాత మైసూరు ప్రాంతంలో 2013 ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 26 సీట్లు వస్తే 2018 నాటికి ఆరు స్థానాలు కోల్పోయి 20 స్థానాలకు పరిమితమైంది. దీంతో వ్యూహాలు మార్చుకొని వొక్కలిగ సామాజిక వర్గానికి చెందిన బలమైన నాయకుడు డి.కె. శివకుమార్‌కు రాష్ట్ర పార్టీ పగ్గాలు అప్పగించింది. జేడీ(ఎస్) నుంచి ఎస్. శ్రీనివాస్, శ్రీనివాస గౌడ, శివలింగ గౌడ గత నెలలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో ప్రధాన నాయకులు శివకుమార్, సిద్దరామయ్యలు ఈ ప్రాంతానికి చెందినవారే కావడం పార్టీకి కలిసొచ్చేఅంశం.

2018 ఎన్నికలు		2013 ఎన్నికలు	
జేడీ(ఎస్)	30	జేడీ (ఎస్)	26
కాంగ్రెస్	20	కాంగ్రెస్	26
బీజేపీ	15	బీజేపీ	8
బీఎస్పీ	1	ఇతరులు	6

పాత మైసూర్

రామనగరం, మాండ్య, మైసూరు, చామరాజ్‌నగర్, కొడగు, కోలార్, తుమకూరు, బెంగళూరు రూరల్, హసన్, కోలార్, చిక్కబళ్లాపూర్
ప్రాబల్య కులం: వొక్కలిగ (రాష్ట్ర జనాభాలో 15%)
అసెంబ్లీ సీట్లు – 66



మైసూరు ప్రాంతంలో పట్టు సాధించాలంటే వొక్కలిగల మనసు గెలుచుకోవడం మినహా మార్గం లేదు. రాష్ట్రంలో లింగాయత్‌ల తర్వాత అత్యధికంగా 15%జనాభా ఉన్న వొక్కలిగ ఓట్లు ఇప్పటివరకు జేడీ(ఎస్), కాంగ్రెస్ పంచుకుంటూ ఉన్నాయి.1906 సంవత్సరంలో

వొక్కలిగ సంఘ్

మొట్టమొదటి సారిగా వొక్కలిగ సంఘ్‌ను ఏర్పాటు చేశారు. మాండ్యలో ఉన్న ఒకే ఒక్క వొక్కలిగ మఠం (ఆదిచుంచనగిరి మఠ్) సామాజిక వర్గాన్ని ఒకటి చేసింది. బాగా చదువుకోవడం మొదలు పెట్టిన వారు క్రమక్రమంగా కర్ణాటకలో రాజకీయంగా బలమైన శక్తిగా ఎదిగారు. అసెంబ్లీలో నాలుగో వంతు మంది ప్రజాప్రతినిధులు వొక్కలిగ సామాజిక వర్గానికి చెందిన వారే కావడం విశేషం.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఉప ఎన్నికల గెలుపుతో పెరుగుతున్న బీజేపీ పట్టు

పాత మైసూరు ప్రాంతానికి చెందిన బలమైన నాయకుల్ని ఆపరేషన్ కమల్ పేరుతో తమ వైపు లాక్కొని బీజేపీ పట్టు పెంచుకుంటోంది. డి. సుధాకర్, కె.సి.నారాయణ గౌడ, హెచ్‌టీ సోమశేఖర్, బైరతి బసవరాజ్, వి. గోపాలయ్య వంటి వారు బసవరాజ్ బొమ్మై కేబినెట్‌లో మంత్రులుగా ఉన్నారు. యడ్డియూరప్ప నేతృత్వంలో పార్టీ ఫిరాయించిన 15 మంది నాయకుల్లో 12 మంది బీజేపీ టికెట్‌పై ఉప ఎన్నికల్లో నెగ్గారు. ఉప ఎన్నికల్లో విజయం సాధించిన ఆత్మవిశ్వాసంతో ఎలాగైనా వొక్కలిగ ఓటు బ్యాంకును తమ వైపు తిప్పుకోవడానికి బీజేపీ వ్యూహరచన మొదలు పెట్టింది. అందులో భాగంగానే ముస్లింలకున్న నాలుగు శాతం రిజర్వేషన్లను రద్దు చేసి వొక్కలిగ, లింగాయత్‌లకు రెండేసి శాతం చొప్పున కట్టబెట్టింది. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్‌షాలు ఈ ప్రాంతంలోనే అధికంగా ర్యాలీలు నిర్వహిస్తూ కాంగ్రెస్, జేడీ(ఎస్) కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన విషయాన్నే ప్రస్తావిస్తున్నారు. వొక్కలిగ ఆత్మనినాదం పేరుతో ఆ సామాజిక వర్గం నాయకుడు కెంపె గౌడ కంచు విగ్రహాన్ని బెంగుళూరు విమానాశ్రయం సమీపంలో మోదీ ఆవిష్కరించారు. ముస్లిం పాలకుడు టిప్పు సుల్తాన్‌ను చంపిన వొక్కలిగ సైనికులైన ఉరిగౌడ, నంజెగౌడలను హీరోలుగా విస్తృతంగా ప్రచారం చేస్తున్న బీజేపీకి పట్టణ ప్రాంతాల్లో వొక్కలిగల మద్దతు లభించే అవకాశాలున్నాయి.

పట్టు నిలుపుకునే వ్యూహంలో జేడీ (ఎస్)

రెండు దశాబ్దాలుగా పాత మైసూరులో పట్టు కొనసాగిస్తూ వస్తున్న జేడీ(ఎస్) దానిని నిలుపుకోవడానికి వ్యూహాలు రచిస్తోంది. వొక్కలిగలు తమకు పెద్ద దిక్కుగా భావించే దేవగౌడ వృద్ధాప్యంతో, అనారోగ్య సమస్యలతో ప్రచారానికి రాలేకపోతున్నారు. దేవెగౌడ కుమారుడు కుమారస్వామి అంతా తానై పార్టీ భారాన్ని మోస్తున్నప్పటికీ కుటుంబ పార్టీ ముద్ర, వలసలు ఊపిరాడనివ్వకుండా చేస్తున్నాయి. 2019 లోక్‌సభ ఎన్నికల్లో తుమకూరు స్థానం నుంచి స్వయంగా ఓటమిపాలైన దేవెగౌడ ఇంటికే పరిమితమయ్యారు. కులపరమైన సెంటిమెంట్‌లను రెచ్చగొట్టి ఎన్నికల్లో తమకి అనుకూలంగా మార్చుకోవడంలో తలపండిన దేవెగౌడ పార్టీ ఎన్నికల ప్రచారం పంచరత్న సభకి వీల్‌చైర్‌లో రావడంతో జనం పోటెత్తారు. వొక్కలిగలో వివిధ ఉపకులాల్లో కూడా దేవెగౌడకు ఆదరణ ఎక్కువగా ఉంది. కన్నడ ఆత్మగౌరవ నినాదంతో జాతీయ పార్టీలను అక్కున చేర్చుకోవద్దంటూ ప్రచారం చేస్తున్న జేడీ(ఎస్) ఈ సారి ఎన్నికల్లో కూడా పాత మైసూరులో 25 నుంచి 35 స్థానాలు గెలుచుకొని సత్తా చాటుతుందని ఎన్నికల విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

ఫైటర్ జెట్‌లో రాష్ట్రపతి ముర్ము ప్రయాణం

తేజ్‌పూర్(అస్సాం): భారత రాష్ట్రపతి, రక్షణ దళాల సుప్రీం కమాండర్ ద్రౌపదీ ముర్ము మొట్టమొదటిసారిగా శనివారం యుద్ధ విమానంలో ప్రయాణించారు. అస్సాంలోని తేజ్‌పూర్ భారత వైమానిక దళ స్థావరం నుంచి సుఖోయ్–30ఎంకేఐ రకం విమానంలో ఆమె ప్రయాణం అరగంటసేపు సాగింది. 106వ స్క్వాడ్రన్ కమాండింగ్ ఆఫీసర్, గ్రూప్ కెప్టెన్ నవీన్ కుమార్ తివారీ ఆ విమానాన్ని నడిపారు. ఫ్లయింగ్ సూట్ ధరించిన రాష్ట్రపతి విమానం ఎక్కబోయే ముందుగా హంగార్ వద్ద వేచి ఉన్న జర్నలిస్టుల వైపు చేతులు ఊపారు. కాక్‌పిట్‌లో కూర్చున్న రాష్ట్రపతికి మహిళా అధికారి ఒకరు హెల్మెట్ తొడిగి, అవసరమైన సాంకేతికపరమైన ఇతర జాగ్రత్తలు పూర్తి చేశారు. విమానం సముద్రమట్టానికి 2 కిలోమీటర్ల ఎత్తులో గంటకు 800 కిలోమీటర్ల వేగంతో బ్రహ్మపుత్ర లోయమీదుగా ప్రయాణించింది. ప్రయాణం చాలా మంచిగా సాగిందని అనంతరం ఆమె మీడియాతో అన్నారు. విమానం వద్ద పైలట్, ఇతర అధికారులతో ఫొటోలు దిగారు. రాష్ట్రపతి ప్రస్తుతం అస్సాంలో పర్యటిస్తున్నారు. హిమాచల్‌ప్రదేశ్ తమదేనంటూ చైనా వివాదం సృష్టిస్తున్న సమయంలో సరిహద్దు రాష్ట్రం అస్సాంలో ఆమె పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. ముర్ము ఈ ఏడాది మార్చిలో దేశయంగా తయారైన విమానవాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్‌ను సందర్శించారని రాష్ట్రపతి భవన్ గుర్తు చేసింది.

సేవ చేయండి.. పేరొస్తుందని చూడకండి

సంఘ్ కార్యకర్తలతో భగవత్

జైపూర్: సమాజంలో పేరు రావాలనే ఉద్దేశంతోకాకుండా ఎలాంటివి ఆశించకుండా నిస్వార్థంగా సేవ చేయండని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ సూచించారు. రాజస్తాన్‌లోని జామ్డోలీలో జరుగుతున్న సేవా సంఘ్‌లో 'రాష్ట్రీయ సేవా భారతి' ప్రతినిధులు, సంఘ్ కార్యకర్తలను ఉద్దేశిస్తూ భగవత్ ఉపన్యసించారు. ' వ్యవస్థీకృతమైన శక్తులు ఎల్లప్పుడూ ఘన విజయాలను సొంతం చేసుకుంటాయి. విశ్వమానవాళి శ్రేయస్సు కోసం నిశ్శబ్దంగా సేవచేసే కార్యకర్తలం మనం. నిస్వార్థ సేవ అలవాటు చేసుకోండి. మనల్ని ఇంకెవరో పొగడాల్సిన అవసరం లేదు. పేరు ప్రఖ్యాతలపైకి దృష్టిని పోనివ్వకండి. సామాజిక సేవ చేస్తే పేరు అదే వస్తుంది. అంతమాత్రానికే దానిపై ధ్యాస పెట్టొద్దు. అహం మీకు అవరోధంగా మారొద్దు. ప్రజా సంక్షేమం కోసం పనిచేసేటపుడు హుందాగా ఉండాలి. మనమేం గొప్ప పని చేయడంలేదు. సమాజం కోసం మన బాధ్యత మనం నిర్వర్తిస్తున్నాం' అని అన్నారు.

బీజేపీలోకి సి.రాజగోపాలచారి ముని మనవడు



న్యూఢిల్లీ: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, భారత దేశ చిట్టచివరి గవర్నర్ జనరల్ అయిన సి.రాజగోపాలాచారి ముని మనవడు సీఆర్ కేశవన్ శనివారం బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. దక్షిణభారతంలో మరింతగా పుంజుకునేందుకు కృషిచేస్తున్న పార్టీలోకి నేతలు చేరుతుండటం బీజేపీకి కొత్త ఉత్సాహాన్ని ఇస్తోంది. కేంద్ర మంత్రి వీకే సింగ్, బీజేపీ ప్రధాన అధికార ప్రతినిధి అనిల్ బలూనీల నేతృత్వంలో ఆయన బీజేపీలో చేరారు. 'ప్రజామోదంతో పాలిస్తూ అవినీతిరహిత, సమ్మిళిత ప్రభుత్వాన్ని ముందుండి నడిపిస్తున్న ప్రధాని మోదీపై గౌరవంతో పార్టీలో చేరాను' అని బీజేపీలోకి వచ్చిన సందర్భంగా కేశవన్ వ్యాఖ్యానించాను. తమిళనాడుకు చెందిన కేశవన్ తొలినాళ్లలో కాంగ్రెస్‌లో కొనసాగారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌ను వీకేసింగ్ పరోక్షంగా విమర్శించారు. 'సి.రాజగోపాలాచారి దేశం కోసం అవిశ్రాంతంగా పోరాడారు. కానీ స్వాతంత్ర్యం వచ్చాక ఆయన చేసిన త్యాగాలు మరుగునపడేలా, చరిత్ర గర్భంలో కలిసిపోయేలా కొందరు కుట్ర పన్నారు. దేశం కోసం తాము మాత్రమే కష్టపడ్డామని కేవలం 'ఒక్క కుటుంబం' మాత్రం ప్రకటించుకుంది' అంటూ గాంధీల కుటుంబాన్ని పరోక్షంగా విమర్శించారు. తమిళనాడులో కేశవన్ బీజేపీ వాణిని గట్టిగా వినిపిస్తారన్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో బీజేపీలో చేరుతున్న నేతల సంఖ్య పెరుగుతోందని చెప్పారు.

చెన్నై ఎయిర్‌పోర్ట్‌లో మరో కొత్త టర్మినల్

- రూ.1,260 కోట్ల టర్మినల్‌ను ప్రారంభించిన ప్రధాని మోదీ
- చెన్నై– కోయంబత్తూరు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ సైతం షురూ



నూతన టెర్మినల్‌ను ప్రారంభిస్తున్న ప్రధాని మోదీ. చిత్రంలో తమిళనాడు గవర్నర్ రవి, ముఖ్యమంత్రి స్టాలిన్ తదితరులు

చెన్నై: చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయంలో రూ.1,260 కోట్లతో నిర్మించిన నూతన ఇంటిగ్రేటెడ్ టర్మినల్ భవంతి(ఫేజ్–1)ను ప్రధాని నరేంద్ర మోదీ శనివారం ప్రారంభించారు. రాష్ట్ర సాంస్కృతిక వారసత్వం ఉట్టిపడేలా అద్భుత రీతిలో ఈ టర్మినల్‌కు తుదిరూపునిచ్చారు. ' సంవత్సరానికి 2.3 కోట్ల మంది ప్రయాణికుల సామర్థ్యమున్న ఎయిర్‌పోర్ట్ నూతన టర్మినల్ ఏర్పాటుతో ఇక మీదట ప్రతి సంవత్సరం మూడు కోట్ల మంది ప్రయాణికుల రాకపోకల సామర్థ్యాన్ని సంతరించుకుంటుంది' అని ప్రభుత్వం పేర్కొంది. తమిళనాడు సంప్రదాయాల్లో ఒకటైన కొల్లం(రంగోలీ), విశేష ప్రాచుర్యం పొందిన పురాతన ఆలయాలు, భరతనాట్యం, రాష్ట్రంలోని ప్రకృతి సోయగాలు, వారసత్వంగా వస్తున్న స్థానిక చీరలు ఇలా తమిళనాడుకే ప్రత్యేకమైన విశిష్టతల మేళవింపుగా భిన్న డిజైన్లతో నూతన టర్మినల్‌ను సర్వాంగ సుందరంగా నిర్మించారు. నూతన టర్మినల్ ప్రారంభోత్సవంలో ప్రధాని మోదీతోపాటు తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా పాల్గొన్నారు. దీంతోపాటు ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో చెన్నై–కోయంబత్తూరు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రధాని మోదీ ప్రారంభించారు. 'అద్భుత నగరాలకు అనుసంధానించిన వందేభారత్‌కు కృతజ్ఞతలు' అని ఈ సందర్భంగా మోదీ ట్వీట్‌చేశారు. కొత్త రైలురాకతో రెండు నగరాల మధ్య ప్రయాణకాలం గంటకుపైగా తగ్గనుంది. రాష్ట్ర రాజధాని, పారిశ్రామిక పట్టణం మధ్య ప్రయాణించే అత్యంత వేగవంతమైన రైలు ఇదే కావడం విశేషం. సేలం, ఈరోడ్, తిరుపూర్‌లలోనూ ఈ రైలు ఆగుతుంది. బుధవారం మినహా అన్ని వారాల్లో ఈ రైలు రాకపోకలు కొనసాగుతాయి.

వివేకానంద హౌజ్‌ను సందర్శించిన మోదీ

చెన్నై పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ నగరంలోని వివేకానంద హౌజ్‌ను దర్శించారు. 1897లో స్వామి వివేకానంద ఈ భవంతిలోనే తొమ్మిదిరోజులు బస చేశారు. రామకృష్ణ మఠ్ 125వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో మోదీ మాట్లాడారు. ' రామకృష్ణమఠ్ అంటే నాకెంతో గౌరవం. నా జీవితంలో ఈ మఠం అత్యంత ముఖ్యమైన పాత్ర పోషించింది. పాశ్చాత్య దేశాలకు పయనంకాకముందు వివేకానందుడు బసచేసిన ఈ భవంతిని దర్శించడం నాకు దక్కిన ఒక మంచి అవకాశం. ఇక్కడ ధ్యానం చేయడం ప్రత్యేకమైన అనుభవం. ఇది నాకెంతో ప్రేరణను, కొండంత బలాన్ని ఇస్తోంది. ఆధునిక సాంకేతికత సాయంతో పురాతనమైన నాటి గొప్ప ఆలోచనలు నేడు ముందు తరాలకు అందుతుండటం చాలా సంతోషదాయకం' అని మోదీ అన్నారు. ఈ సందర్భంగా వివేకానంద విగ్రహానికి మోదీ ఘన నివాళులర్పించారు.

దళిత మహిళపై రేప్.. సజీవదహనం

జైపూర్: రాజస్తాన్‌లో ఘోరం జరిగింది. ఓ దుర్మార్గుడు దళిత మహిళపై అత్యాచారానికి పాల్పడి, అనంతరం ఆమెకు నిప్పంటించాడు. తీవ్ర గాయాలపాలైన బాధితురాలు ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచింది. బార్మెర్ జిల్లాకు చెందిన దళిత మహిళ(30) ఈ నెల 6న రాత్రి ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో అదే గ్రామానికి చెందిన షకూర్‌ఖాన్ అనే వ్యక్తి బలవంతంగా లోపలికి ప్రవేశించాడు. ఆమెపై లైంగికదాడికి పాల్పడిన అనంతరం యాసిడ్ వంటి ద్రావకాన్ని ఒంటిపై పోసి, నిప్పంటించి పరారయ్యాడు. 50 శాతం గాయాలపాలైన బాధితురాలు జోధ్‌పూర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి చనిపోయారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు నిందితుడు ఖాన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు.

చెత్త బట్టల్లో శూర్పణఖల్లా ఉంటారు

మహిళల వస్త్రధారణపై నోరు పారేసుకున్న బీజేపీ నేత కైలాష్ విజయ్‌వర్గియా



ఇండోర్: అమ్మాయిల వస్త్రధారణపై బీజేపీ ప్రధాన కార్యదర్శి కైలాష్ విజయ్‌వర్గియా నోరు పారేసుకున్నారు. చెత్తగా బట్టలు వేసుకునే వారంతా శూర్పణఖల్లా ఉంటారని వ్యాఖ్యానించారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో హనుమాన్ జయంతి సందర్భంగా ఆయన చేసిన ఈ వాఖ్యలపై మహిళా సంఘాలు, విపక్ష పార్టీలు మండిపడుతున్నాయి. దేశంలోని ప్రతీ మహిళని కైలాస్ అవమానించాడని విరుచుకుపడుతున్నాయి. 'నేను రాత్రి పూట ఇంటికి వెళుతున్నప్పుడు చూస్తాను. యువతులు పరమ చెత్త బట్టల్లో కనిపిస్తున్నారు. అప్పుడే కారు దిగి అయిదారు సార్లు వారిని ఎడాపెడా కొట్టి హుందాగా ఉండండని చెప్పాలనిపిస్తుంది. మన దేశంలో మహిళల్ని దేవతలుగా కొలుస్తాం. వారు ఇప్పుడు శూర్పణఖల్లా కనిపిస్తున్నారు. దేవుడు మీకు అందమైన శరీరాన్ని ఇచ్చాడు. దానికి తగ్గట్టుగా వస్త్రధారణ ఉండాలి. కనీసం మీ పిల్లలకైనా మన సంస్కృతి, సంప్రదాయాలు నేర్పండి' అని కైలాష్ అన్న వీడియో సామాజిక మీడియాలో చక్కర్లు కొడుతోంది. 'మహిళలు ఎలాంటి బట్టలు వేసుకోవాలి, ఏం తినాలి, ఎవరిని కలవాలి వంటివన్నీ చెప్పడానికి మనం తాలిబన్ల పాలనలో ఉన్నామా?' అని అఖిల భారత మహిళా కాంగ్రెస్ చీఫ్ నెట్టా డిసౌజా ప్రశ్నించారు.

తైవాన్‌పై మళ్లీ చైనా ఆగ్రహజ్వాల

యుద్ధనౌకలు, విమానాలను మోహరించిన డ్రాగన్



తైవాన్ జలాలపై చైనా యుద్ధవిమానాలు

బీజింగ్: తైవాన్ అధ్యక్షురాలు త్సాయి ఇంగ్ వెన్ అమెరికాలో పర్యటించడాన్ని సహించని చైనా ఆగ్రహంతో రగిలిపోతోంది. ఎనిమిది యుద్ధనౌకలు, 71 యుద్ధవిమానాలను మోహరించి తైవాన్ సముద్రజలాల్లో ఉద్రిక్తత ను మరింత పెంచింది. తమ అధ్యక్షురాలు అమెరికాలో పర్యటించడంతో అక్కసుతో చైనా ఇలాంటి బెదిరింపు చర్యలకు దిగుతోందని తైవాన్ ప్రభుత్వం వ్యాఖ్యానించింది. 45 యుద్ధవిమానాలు 'మిడిల్‌లైన్'ను దాటి మరీ తమ ప్రాదేశిక జలాలపై చక్కర్లు కొడుతున్నాయని తైవాన్ ఆగ్రహం వ్యక్తంచేసింది. 'యుద్ధ సన్నద్ధత గస్తీ' మాటున మూడ్రోజులపాటు నౌకాదళ సంపత్తిని చైనా రంగంలోకి దించింది. అమెరికా పర్యటనలో భాగంగా తైవాన్ అధ్యక్షురాలు త్సాయి గురువారం కాలిఫోర్నియాలో అమెరికా పార్లమెంట్ ప్రతినిధుల సభ స్పీకర్ కెవిన్ మెక్‌కార్తీతో భేటీ అయ్యారు. దీంతో కోపం తెచ్చుకున్న చైనా పలు అమెరికన్ సంస్థలు, వ్యక్తులపై ఆంక్షలు విధించింది.

ఉత్తరకొరియా మళ్లీ అణ్వస్త్ర డ్రోన్ పరీక్ష

సియోల్: అణుధార్మిక సునామీని సృష్టించగల అండర్‌వాటర్ డ్రోన్‌ను మరోసారి విజయవంతంగా పరీక్షించినట్లు ఉత్తరకొరియా తెలిపింది. ఈ కొత్త రకం డ్రోన్ హెయిల్–2ను శుక్రవారం తీర నగరం టంచోన్ వద్ద సుముద్ర జలాల్లో ప్రయోగించినట్లు వెల్లడించింది. నీటి అడుగున ఇది 71 గంటలకు పైగా ప్రయాణించి నిర్దేశిత లక్ష్యాన్ని ఛేదించిందని తెలిపింది. వెయ్యి కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను హెయిల్–2 తుత్తునియలు చేయగలదని అధికార వార్తా సంస్థ కేసీఎన్ఏ పేర్కొంది.

కర్ణాటకలో ఎన్నికల వేళ తనిఖీలు.. రూ.4.75 కోట్ల నగదు పట్టివేత

బొమ్మనహళ్లి: కర్ణాటకలో అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమలు నేపథ్యంలో విస్తృతంగా సాగుతున్న తనిఖీల్లో ఒకేసారి భారీఎత్తున నగదు పట్టుబడింది. బెంగళూరు నగర జిల్లా పరిధిలోని ఆనేకల్ నియోజకవర్గం వీరసంద్ర చెక్‌పోస్ట్ వద్ద శనివారం సాయంత్రం ఎన్నికల స్క్వాడ్ తనిఖీలలో రూ.4 కోట్ల 75 లక్షల నగదు లభించింది. ప్రైవేటు కంపెనీలకు చెందిన మూడు వాహనాలను తనిఖీ చేయగా నోట్ల కట్టలు బయటపడ్డాయి. నగదును తరలిస్తున్నవారి వద్ద ఎలాంటి రసీదులు లేకపోవడంతో సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఐటీ అధికారులకు సమాచారమిచ్చామన్నారు. దావణగెరె తాలూకా హెబ్బాల చెక్‌పోస్టు వద్ద ఎన్నికల సిబ్బంది తనిఖీల్లో బీఎండబ్ల్యూ కారులో తరలిస్తున్న రూ.39 లక్షల విలువైన 66 కేజీల వెండి పాత్రలు లభించాయి. చెన్నై నుంచి ముంబైకి వీటిని తరలిస్తున్నట్లు తెలిసింది. ఈ కారు దివంగత ప్రముఖ నటి శ్రీదేవి భర్త, బాలీవుడ్ నిర్మాత బోనీకపూర్‌కి చెందినదిగా భావిస్తున్నారు. కారును, వస్తువులను సీజ్ చేసి విచారణ చేపట్టారు.



స్వాధీనం చేసుకున్న నగదు

జేపీసీ కంటే కోర్టు కమిటీ అత్యుత్తమం

హిండెన్‌బర్గ్– అదానీ ఉదంతంపై శరద్ పవార్ వ్యాఖ్య



ముంబై: కుబేరుడు గౌతమ్ అదానీ షేర్ల కొనుగోలు వ్యవహారంపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) వేయాలంటూ కొద్దిరోజులుగా విపక్ష పార్టీలు ఉమ్మడిగా డిమాండ్ చేస్తున్న వేళ ఎన్సీపీ చీఫ్ శరద్ పవార్ భిన్నమైన వాదన చేశారు. ఈ మేరకు ఆయన శనివారం ముంబైలో మీడియాతో మాట్లాడారు. 'విపక్షాల జేపీసీ డిమాండ్‌తో నేను పూర్తిగా విభేదించడం లేదు. కానీ జేపీసీ కంటే సర్వోన్నత న్యాయస్థానం కమిటీ ఈ వివాదాన్ని మరింత అర్థవంతంగా, ప్రభావవంతంగా పరిష్కరించగలదని భావిస్తున్నా' అని వ్యాఖ్యానించారు. 'గతంలో కొన్ని జేపీసీలకు అధ్యక్షత వహించిన అనుభవం నాకుంది. అదానీ–హిండెన్‌బర్గ్ ఉదంతంలో ఒకవేళ జేపీసీ వేస్తే అందులో 21 మంది సభ్యులుంటారు. పార్లమెంట్‌లో పార్టీల సంఖ్యాబలం ఆధారంగా 15 సభ్యత్వాలు అధికార పార్టీకే దక్కుతాయి. ఇక మిగిలిన ఆరుగురే విపక్షాలకు చెందిన వారు ఉంటారు. ఇది ప్యానెల్ పనితీరుపై అనుమానాలు రేకెత్తించే అవకాశం ఉంది. జేపీసీ ఏర్పాటును పూర్తిగా వ్యతిరేకించట్లేను. దాని కంటే సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తుల ప్యానెల్ ప్రభావవంతంగా పనిచేయగలదు. నిర్ణీత కాలావధిలో నివేదించగలదు' అని పవార్ అభిప్రాయపడ్డారు. కాగా, ఇటీవల ఒక జాతీయ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అదానీ సంస్థకు పవార్ మద్దతిస్తూ హిండెన్‌బర్గ్‌ను విమర్శించడం గమనార్హం. 'అదానీ గ్రూప్‌పై అమెరికా కేంద్రంగా పనిచేసే చరిత్రలేని ఏదో సంస్థ మాట్లాడితే దానికి ఎంత విలువ ఇవ్వాలో మనం నిర్ణయించుకోవాలి. ఇలాంటి ప్రకటనలు, నివేదికలు గతంలోనూ పలు సందర్భాల్లో వచ్చాయి. ఇలాంటి వాటి కారణంగా తాజాగా పార్లమెంట్ కార్యకలాపాలు స్తంభించిపోయాయి. దీనికి అనవసర ప్రాధాన్యం ఇచ్చాం. నిరుద్యోగం, పెరిగిన ధరలు, రైతు సమస్యలు ఇలా దేశంలో ఎన్నో సమస్యలున్నాయి. వాటిని వదిలేసి ఇలా అప్రధాన అంశాలను పట్టించుకుంటే ఇవి దేశ ఆర్థికవ్యవస్థపైనా ప్రభావం చూపుతున్నాయి. వీటిని చూస్తుంటే కావాలనే ఏదో లక్ష్యంగా చేసుకుని ఈ తరహా అంశాలను లేవనెత్తుతున్నారు అనిపిస్తోంది ' అని పవార్ వ్యాఖ్యానించారు. జేపీసీ పట్ల పవార్ విముఖత వ్యక్తంచేయడంపై కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ స్పందించారు. ' ఈ అంశంలో 19 భావసారూప్య పార్టీలు ఒకే డిమాండ్‌తో ముందుకెళ్తున్నాయి. అయితే ఎన్సీపీకి సొంత అభిప్రాయాలు ఉండొచ్చు' అని అన్నారు. పవార్ అభిప్రాయం మహారాష్ట్రలో, దేశంలో విపక్షాల ఐక్యతకు బీటలు పడేలా చేయలేదని శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ స్పష్టంచేశారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
ఆదివారం • 9 • ఏప్రిల్ • 2023

సంబరంగా సిడిమాను



మైసూరు: మైసూరు జిల్లాలోని హుణసూరు తాలూకాలోని కట్టెమళలవాడి గ్రామంలో జరిగిన సియమ్మ దేవి జాతరలో శనివారం సాయంత్రం సిడిమాను ఉత్సవం వైభవంగా సాగింది. చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు తరలి వచ్చారు. మొదట లక్ష్మణ తీర్థ నదిలో స్నానాలు ఆచరించి అమ్మవారికి పూజలు నిర్వహించి సిడిమాను ఉత్సవంలో పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

మద్యం మత్తులో విమానంలో హంగామా



నిందితుడు ప్రతీక్

దొడ్డబళ్లాపురం: విమానంలో మద్యపానం చేసి తోటి ప్రయాణికులకు ఇబ్బంది కలిగించడంతో పాటు అత్యవసర ద్వారం తెరవడానికి ప్రయత్నించిన ప్రయాణికున్ని పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారంనాడు ఢిల్లీ నుంచి బెంగళూరు కెంపేగౌడ విమానాశ్రయానికి ఇండిగో విమానం బయల్దేరింది. అందులో సీట్ నం.18ఎఫ్ లో కూర్చున్న ఉత్తరప్రదేశ్ ఖానాపురకు చెందిన ప్రతీక్ (30) అనే వ్యక్తి తాగిన మత్తులో తోటి ప్రయాణికులతో అనుచితంగా ప్రవర్తించాడు. విమానం తలుపులు తెరవడానికి యత్నించాడు. విమానం దిగగానే ఎయిర్ పోర్టు పోలీసులు అతన్ని అరెస్టు చేశారు.

ఎయిర్‌పోర్టులో బంగ్లాదేశీయుల అరెస్టు

దొడ్డబళ్లాపురం: నకిలీ పాస్‌పోర్టులతో వచ్చిన ఇద్దరు బంగ్లాదేశ్ పౌరులను బెంగళూరు కెంపేగౌడ ఎయిర్‌పోర్టులో పోలీసులు అరెస్టు చేసారు. బంగ్లాదేశ్‌కు చెందిన లియాకత్ అలీ, రిజావుల్ షేక్‌లు నిందితులు. వీరు కోల్‌కతా నుంచి వచ్చిన విమానంలో దిగారు, ఇద్దరి పాస్‌పోర్టులను అధికారులు పరిశీలించగా ఇతరుల పేర్లతో నకిలీ పాస్‌పోర్టులు చేయించుకున్నట్లు తెలిసింది. లియాకత్ అలీ అనే నిందితుడు లియాకత్ షేక్ అని, రిజావుల్ షేక్ అనే అతడు రీగన్ షేక్ అనే పేరుతో భారతీయ పాస్‌పోర్టులు చేయించుకున్నారు. వీరు ఇద్దరూ ఏ ఉద్దేశంతో దేశంలోకి చొరబడ్డారు, వీరి నేపథ్యం ఏమిటనేది విచారణలో తెలియాల్సి ఉంది. అరెస్టు చేసి విచారణ చేపట్టారు.

రమణీయం జ్యోతుల ఉత్సవం



తుమకూరు: జిల్లాలోని శిరా తాలుకా హులిగెరె గొల్లరహట్టిలో శ్రీహట్టి లక్ష్మమ్మ అమ్మవారి జాతర వేడుకలు ఘనంగా జరిగాయి. వందల సంఖ్యలో మహిళలు తరలి వచ్చి అమ్మవారికి జ్యోతులను సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆన్‌లైన్‌లో మహిళకు బురిడీ

యశవంతపుర: మొత్తం పెట్టుబడిగా పెడితే రెట్టింపు లాభం వస్తుందని నమ్మించి మహిళకు మోసం చేసిన వంచకున్ని బెంగళూరు ఈశాన్య విభాగం పోలీసులు అరెస్ట్ చేశారు. జక్కూరుకు చెందిన రజని (33) మొబైల్‌ఫోన్‌కి మార్చి 31న అపరిచిత వ్యక్తి పార్ట్‌టైం జాబ్ ఉందని మెసేజ్ పంపాడు. నిజమేనని నమ్మిన ఆమె అతన్ని సంప్రదించగా కొంత పెట్టుబడి పెట్టాలని, దండిగా లాభాలు వస్తాయని నమ్మించాడు. ఆమె నుంచి రూ.7.10 లక్షలను వసూలు చేశాడు. ఒక టెలిగ్రామ్ గ్రూప్‌కి యాడ్ చేసి టాస్కులు ఇచ్చేవాడు. కానీ ఒక్క రూపాయి కూడా ఆదాయం రాలేదు. మోసపోయానని తెలుసుకున్న బాధితురాలు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

రాహుల్ సభ 16కు వాయిదా

యశవంతపుర: ఈ నెల 10న కోలారులో పర్యటించవలసిన కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ పర్యటన 16వ తేదీకి వాయిదా పడింది. కోలారులో చేసిన ప్రసంగం వల్లనే గుజరాత్‌లో కేసు నమోదై ఆయనకు రెండేళ్ల జైలుశిక్ష పడడం, ఎంపీ సభ్యత్వం రద్దు కావడం వంటి పరిణామాలు జరిగాయి. కాబట్టి మళ్లీ కోలారులోనే రాహుల్‌తో సభ నిర్వహించాలని పార్టీ నిర్ణయించింది. కాంగ్రెస్ ఎన్నికల ప్రచారాన్ని కూడా ఈ సభలో ప్రారంభిస్తారు. కోలారుకు దగ్గరిలోని టమక వద్ద 11 ఎకరాలలో సభాస్థలిని సిద్ధం చేశారు.

టికెట్ వస్తే ఓకే, లేదంటే జంప్!

టికెట్ ఎవరికి ఇవ్వాలి, మిగతావారు ఊరుకుంటారా?, తిరుగుబాటు చేస్తే ఓట్లు చీలిపోతాయా? అనే అనేక అనుమానాలు అన్ని పార్టీలను పీడిస్తున్నాయి. టికెట్ల కోసం పోటీ తీవ్రంగా ఉండడం వల్ల అందరికీ దక్కే అవకాశం లేదు. రానివారిని ఎలా బుజ్జగించాలా అని మథనపడడం పార్టీల వంతైంది.

- అన్ని పార్టీల్లో ఆశావహుల ప్రయత్నాలు
- బీజేపీ జాబితాపై ఉత్కంఠ
- టికెట్ రాని ముఖ్యులకు ఇతర పక్షాల ఆఫర్?





శివాజీనగర: కాంగ్రెస్ పార్టీలో టికెట్ రాని నాయకులు కొందరు జేడీఎస్, బీజేపీ వైపు చూస్తుండగా, బీజేపీలో టికెట్ దక్కదేమో అని అనుమానం ఉన్న సిట్టింగ్ ఎమ్మెల్యేలు, నేతలు ప్రతిపక్షాల వైపు చూడడం మొదలైంది. వెరసి అన్ని పార్టీల్లోని నాయకులు అటు ఇటు చూస్తున్నారని చెప్పవచ్చు. బీజేపీ అభ్యర్థుల జాబితాను ఖరారు చేసేందుకు శనివారం, ఆదివారం ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో బీజేపీ పార్లమెంటరీ బోర్డు సమావేశం జరుగుతోంది. ఈ తరుణంలో టికెట్ లభించడం అనుమానంగా ఉన్న కొంతమంది ప్రస్తుత ఎమ్మెల్యేలు కాంగ్రెస్, జేడీఎస్‌లలో చేరాలనే మనసుతో ఉన్నారు. ఇప్పటికి కొందరు కాంగ్రెస్, జేడీఎస్ నాయకులతో ఓ విడత చర్చలు జరిపారని తెలిసింది. ప్రస్తుత పాలకపక్ష ఎమ్మెల్యేల్లో కనీసం 20 మందికి టికెట్ తప్పిపోయే అవకాశముంది. వీరంతా కాంగ్రెస్, జేడీఎస్ పెద్దలతో చర్చల్లో ఉన్నారని, టికెట్ ఇస్తే చేరడం ఖాయమని సమాచారం.

బీజేపీలో కలవరం

బీజేపీ టికెట్లకు విపరీతమైన పోటీ నెలకొంది. 30 - 40 నియోజకవర్గాల్లో నలుగురు నుంచి ఐదు మంది టికెట్ కోరడం వల్ల ఎవరిని అభ్యర్థిగా చేసినా మిగతావారు ఆగ్రహిస్తారనే ఆందోళన పార్టీలో నెలకొంది. బీజేపీలో సిట్టింగ్ ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో ఇద్దరి కంటే ఎక్కువమంది టికెట్ టికెట్ అని పట్టుబట్టినట్లు తెలిసింది. సిట్టింగ్‌లకు ఇవ్వడమా, కొత్త ముఖాలకు అవకాశం కల్పించడమా అనే ఆలోచనలో పార్టీ పెద్దలున్నారు. అందుచేత బీజేపీ నాయకులు చాలా జాగ్రత్తలతో అభ్యర్థుల జాబితా తయారీలో తలమునకలయ్యారు.

హస్తినలో బీజేపీ హైకమాండ్ భేటీ

ఢిల్లీలో బీజేపీ అభ్యర్థుల ఎంపిక సమావేశంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు జే.పీ.నడ్డా, హోం మంత్రి అమిత్ షా, సీఎం బొమ్మై, యడియూరప్ప, రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి ధర్మేంద్ర ప్రధాన్, బీ.ఎల్.సంతోష్, కర్ణాటకకు చెందిన కేంద్ర మంత్రులు మంతనాలు జరిపారు. ఆదివారం సాయంత్రానికి అభ్యర్థుల జాబితా ఫైనల్ కావచ్చని వినికిడి.

జాబితాల మాయాజాలం

కాంగ్రెస్ రెండో జాబితా విడుదల కాగానే టికెట్ లభించని ఆకాంక్షులు జేడీఎస్, బీజేపీలోకి చేరేందుకు సిద్ధమయ్యారు. బీజేపీ జాబితా విడుదలైన వెంటనే కొందరు కాంగ్రెస్, జేడీఎస్‌లలో చేరటం తథ్యంగా కనిపిస్తోంది. కొన్నిచోట్ల బలమైన అభ్యర్థుల కొరత అనుభవిస్తున్న ప్రతిపక్షాలు బీజేపీ రెబెల్స్ ద్వారా లబ్ధి పొందాలనే యోచనలో ఉన్నాయి. ఈ కారణం వల్లనే జేడీఎస్ అభ్యర్థుల రెండో జాబితా, కాంగ్రెస్ మూడో జాబితా పెండింగ్‌లో పెట్టినట్లు భావిస్తున్నారు. బీజేపీ జాబితాను ప్రకటించిన తరువాత అక్కడ టికెట్ దక్కని ప్రముఖ నేతలకు తమ పార్టీ కండువా కప్పాలని ప్రతిపక్షాలు ఆశగా ఉన్నాయి.

కారును తోసుకెళ్లిన గజరాజు



దెబ్బతిన్న కారుతో యజమాని

మైసూరు: ఏ పనీ లేని గజరాజు ఏదో ఒక పనిని చేయాలనుకుంది. రోడ్డుపక్కన నిలిపి ఉన్న కారును కొంతదూరం తోసుకుంటూ వచ్చింది. ఈ విచిత్ర సంఘటన సొండికొప్ప దగ్గర జరిగింది. ఏడవ హొసకోటె లోని మేట్నహళ్లి వద్ద ఉన్న హైవే పక్కన శేఖర్ అనే వ్యక్తి కారును నిలిపి ఉంచాడు. శనివారం తెల్లవారుజామున 4.30 గంటల సమయంలో అటువైపు వచ్చిన అడవి ఏనుగు కారును తోసుకుంటూ రోడ్డు మధ్యలోకి తీసుకెళ్లింది. ఉదయం కారును చూసి యజమాని కంగుతిన్నాడు. కారు ముందు భాగం కొంత దెబ్బతినింది. అటవీ అధికారులు వచ్చి పరిశీలించారు.

కావేరి నదిలో ముగ్గురు జలసమాధి



ధనరాజ్, ప్రసన్న




బాలు


మండ్య: కావేరి నదిలో నీటిలో మునిగి ముగ్గురు మృతి చెందిన సంఘటన మండ్య జిల్లాలోని శ్రీరంగపట్టణం తాలూకాలో జరిగింది. మృతులు మైసూరుకు చెందిన ధనరాజ్ (21), ప్రసన్న (33), శ్రీరంగపట్టణం తాలూకా మహాదేవపురవాసి బాలు (16). పర్యాటక ప్రాంతమైన బలమురిలోని కావేరి నదిలో ఈతకు వెళ్లిన ముగ్గురూ లోతు ఎక్కువగా ఉన్న చోట మునిగిపోయారు. అరికెరె, కేఆర్‌ఎస్ పోలీసులు వచ్చి మృతదేహాలను బయటికి తీశారు. ఘటనాస్థలి బంధుమిత్రుల రోదనలతో దద్దరిల్లింది.

వినోదాల విందు



సర్కస్ చూడాలంటే అందరికీ సరదానే. అందులోని జోకర్లు, జంతువులు చేసే విన్యాసాలు అబ్బురపరిచేవి. ఒకప్పుడు ఊరూరా వినోదం పంచిన సర్కస్ ప్రదర్శనలు కాలక్రమంలో కనుమరుగయ్యాయి. ఇప్పుడు ఆధునిక హంగులు అద్దుకుని మళ్లీ ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. ఇందులో దేశ విదేశీ కళాకారులు, విదూషకులు మరింత అలరిస్తారు. బెంగళూరు కోరమంగలలో ఓ సర్కస్ ప్రదర్శన ఆరంభమైంది. ఈ సందర్భంగా కళాకారుల విన్యాసాలు





ఆచూకీ చెబితే రూ. 5 లక్షల కానుక



బనశంకరి: బెంగళూరులో హత్యకు గురైన హిందూ కార్యకర్త రుద్రేష్ కేసులో ప్రధాన ఆరోపి మహమ్మద్‌గౌస్ నయాజీ జాడ చెప్పినవారికి రూ.5 లక్షలు బహుమానం ఇస్తామని ఎన్‌ఐఏ ప్రకటించింది. ఈ కేసులో పలువురు అరెస్టయినప్పటికీ నయాజీ జాడ లేదు. రుద్రేష్ బెంగళూరులో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తగా ఉండేవాడు. 2016, అక్టోబరులో ఒక సమావేశం చూసుకుని వస్తుండగా కమర్షియల్ స్ట్రీట్‌లో దుండగులు బైక్‌తో ఢీకొట్టి, కత్తులతో పొడిచి చంపారు. ఇందులో పీఎఫ్ఐకి చెందిన కొందరి పాత్ర ఉందని ఆరోపణలు వచ్చాయి. ఇర్ఫాన్ పాషా, మహమ్మద్ ముజీబుల్లా అనేవారిని అరెస్టు చేసి జైలుకు తరలించారు. ప్రధాన నిందితునిగా ఉన్న నయాజీ ఆచూకీ లభించకపోవడంతో ఎన్‌ఐఏకు చిక్కుముడిగా మారింది. అతని ఆచూకీ తెలిపిన వారికి రూ.5 లక్షలు బహుమానం ప్రకటిస్తామని ఎన్‌ఐఏ అధికారులు తెలిపారు.

అకాల వానలకు నలుగురు బలి

యశవంతపుర: రాష్ట్రంలో శుక్రవారం ఉరుములు పిడుగులతో కురిసిన అకాల వానలతో నలుగురు మృతి చెందారు. గదగ తాలూకా లింగదాళ గ్రామంలో శరణప్ప పురద (19), దేబరాజ హనుమంతప్ప(19)లు గొర్రెలను కాస్తుండగా పిడుగులు పడడంతో ఇద్దరూ మరణించారు. సునీల్ అనే యువకుడు గాయపడ్డాడు. బాగలకోట జిల్లా బాదామి తాలూకా జాలిహాళ గ్రామంలో ఇంటి పైకప్పు కూలిపోయి యంకుబాయి కులకర్ణి (79), సారవ్వ పత్తార (58)లు దుర్మరణం చెందారు. ఇక పలు గ్రామాల్లో కలిసి 13 గొర్రెలు, కొన్ని ఎద్దులు చనిపోయాయి. దక్షిణ కన్నడ జిల్లా బెళ్తంగడి తాలూకాలోని వివిధ ప్రాంతాలలో వడగండ్ల వాన కురిసింది.

వేడెక్కిన పాల రాజకీయం

- సీఎం బొమ్మై, విపక్షాల రగడ



బనశంకరి/ యశవంతపుర: ఎన్నికల సమయంలో పాల రాజకీయం వేడెక్కింది. రాష్ట్రంలో పాల పరిశ్రమకు వ్యతిరేకంగా బొమ్మై సర్కారు ప్రవర్తిస్తోందని విపక్షాలు ఆరోపిస్తుంటే, పాల రాజకీయం సరికాదని సీఎం సూచించారు. అమూల్ పాల విషయంలో విపక్షాలు రాజకీయం చేస్తున్నాయని, ఇది సరికాదని ముఖ్యమంత్రి బసవరాజ బొమ్మై తెలిపారు. శనివారం ఆయన ఢిల్లీలో విలేకరులతో మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల్లో కూడా నందిని పాలను విక్రయిస్తున్నామని, పోటీ మార్కెట్‌లో ముందుండేలా చూస్తామని తెలిపారు.

టికెట్ రేసులో ఎంపీలు, ఎమ్మెల్సీలు

కాగా, బీజేపీ అభ్యర్థులపై పార్టీ పెద్దలతో చర్చలు జరుగుతున్నాయని బొమ్మై తెలిపారు. కొందరు ఎంపీలు, ఎమ్మెల్సీలు టికెట్ రేసులో ఉన్నారని వీరికి టికెట్ ఇవ్వాలా వద్దా అనేదానిపై తీర్మానిస్తామని తెలిపారు. నటుడు సుదీప్ బీజేపీకి మద్దతు ఇవ్వడంతో కాంగ్రెస్ పార్టీకి భయం పట్టుకుందని, సినీనటులను ఎన్నికల ప్రచారానికి ఆహ్వానించడం కొత్త కాదని, గతంలో అంబరీశ్ కాంగ్రెస్ తరపున ప్రచారం చేశారని తెలిపారు.

పాల రైతులకు అన్యాయం: డీకే

గుజరాత్‌కు చెందిన అమూల్ పాలు రాష్ట్రంలోకి వస్తే రైతులకు అన్యాయం జరుగుతుందని కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ ఆరోపించారు. అమూల్ పాలను అడ్డుకోకుంటే నందిని పాల ఉత్పత్తిదారులు నష్టపోతారని అన్నారు. అమూల్ పాలు, పెరుగును కర్ణాటకలో అమ్మవలసిన అవసరం ఏమిటి? అని మండిపడ్డారు. రైతులను మోసం చేయడానికి బీజేపీ యత్నిస్తోందన్నారు.

స్వాధీనాల్లో రాజధాని ప్రథమం

- ఇప్పటికి రూ.33 కోట్ల నగదు, వస్తుసామగ్రి సీజ్

శివాజీనగర: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన మార్చి 29 నుంచి ఇప్పటివరకు బెంగళూరు నగర జిల్లా పరిధిలో 730 కేసులు నమోదయ్యాయి. శుక్రవారం ఒక్కరోజే 14 ఎఫ్ఐఆర్‌లు నమోదై రూ.5 లక్షలు నగదు, 9319 లీటర్ల మద్యం, 2.32 కేజీల మత్తు పదార్థాలు, 2,771 వివిధ వస్తువులు, నాలుగు వాహనాలు సీజ్ చేసినట్లు ఈసీ తెలిపింది. మొత్తం రూ.33 కోట్లకు పైగా విలువచేసే నగదు, బంగారు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. బెంగళూరు నగర జిల్లా ఎన్నికలాధికారి వ్యాప్తిలో ప్రజల నుంచి 24 గంటల పాటు ఫిర్యాదులు స్వీకరించేందుకు హెల్ప్ లైన్లను ఏర్పాటు చేశారు. ప్రజలు నిర్భయంగా ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. కాగా రాష్ట్రం మొత్తం మీద సుమారు రూ. 44 కోట్ల నగదు, విలువైన వస్తుసామగ్రి సోదాల్లో పట్టుబడగా, అందులో బెంగళూరుదే సింహభాగం కావడం విశేషం.



శనివారం బెంగళూరు రాజా రామమోహన్ రాయ్ రోడ్డులో తనిఖీల దృశ్యం

వేలాది కుక్కర్లు, దోసె పెనాలు సీజ్

బనశంకరి: బెంగళూరు బ్యాడరహళ్లి గోదాములో అక్రమంగా నిల్వ ఉంచిన రూ. 1.5 కోట్ల విలువచేసే 4,533 కుక్కర్లు, 11 వేల దోసె పెనాలను శనివారం ఎన్నికల స్క్వాడ్ స్వాధీనం చేసుకుంది. పెనాలు, కుక్కర్లు ఎక్కడి నుంచి తీసుకువచ్చారు, ఎవరికి పంచడానికి సేకరించారు అనేదానిపై పోలీసులు, ఎన్నికల అధికారులు విచారణ దర్యాప్తు చేపట్టారు.

జనావాసాల్లోకి గజరాజు

- పొలంలో తల్లీకూతుళ్లపై దాడి, కూతురు మృతి
- దావణగెరె జిల్లాలో కలకలం



అడవి నుంచి వచ్చిన ఏనుగు. (ఇన్‌సెట్) మృతురాలు కవన

సాక్షి, బళ్లారి: అడవిలో సంచరించే ఓ ఏనుగు దారి తప్పి జనావాసాల్లోకి వచ్చి మనుషులపై దాడి చేయడంతో ఒక యువతి మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. వివరాలు.. శనివారం దావణగెరె జిల్లా చెన్నగిరి తాలూకా సోమ్లాపుర, కాశీపుర చుట్టుపక్కల ఉన్న అడవుల్లోని ఓ ఏనుగు ఊళ్ల మీద పడింది. తోటలో అనపకాయలను కోస్తున్న తల్లి మంజుల (42), ఆమె కుమార్తె కవన (18)లపై ఏనుగు వెనుక నుంచి వచ్చి దాడి చేసింది. తొండంతో కొట్టి కాళ్లతో తొక్కడంతో తల్లీకూతుళ్లిద్దరూ గాయపడ్డారు. ఇద్దరినీ ఆస్పత్రికి తరలించగా కుమార్తె కవన కొంతసేపటికే మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. ఏనుగు అకృత్యంతో కుటుంబ సభ్యుల ఆర్తనాదాలు మిన్నంటాయి. వీరితో పాటు మరో ఇద్దరిపై కూడా ఏనుగు దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. కాగా అడవిలోని గజరాజులు ఊళ్ల మీదకు వస్తుండడంతో సమీప గ్రామాల ప్రజలు బయటకు రావాలంటే వణికిపోతున్నారు. అటవీ సిబ్బంది తక్షణం ఏనుగులను అడ్డుకోవాలని కోరారు.



కొన్ని జిల్లాల్లో అకాల వర్షాలు కురిశాయి. శనివారం ధార్వాడ నగరంలో వర్షం పడిన దృశ్యం. వరుణుని పలకరింపుతో వేసవి తాపం నుంచి ప్రజలకు ఉపశమనం దక్కింది



అందరూ ఓటేయండహో అని యువత, కళాకారులు నృత్యాలు చేస్తున్న దృశ్యాలు. బెంగళూరు చర్చ్ వీధిలో ఓటు హక్కు జాగృతి జాతా ఉత్సాహంగా జరిగింది



క్లుప్తంగా

తల్లీకూతుళ్ల విస్తృత ప్రచారం



17వ వార్డులో ప్రచారం చేస్తున్న అభ్యర్థిని లక్ష్మీ అరుణ, కుమార్తె బ్రహ్మణీ

సాక్షి,బళ్లారి: కేఆర్‌పీపీ నగర అభ్యర్థిని లక్ష్మీ అరుణతో పాటు కుమార్తె బ్రహ్మణీ విస్తృతంగా ప్రచారం చేశారు. శనివారం వారు 17వ వార్డులో ఇంటింటా కలియతిరుగుతూ పార్టీ గుర్తు ఫుట్‌బాల్‌కు ఓటు వేసి నగరాభివృద్ధికి సహకరించాలని కోరారు. మండుటెండలో ఇంటింటా తల్లీకూతుళ్ల ప్రచారానికి మంచి స్పందన లభించింది. ఒకసారి అవకాశం ఇస్తే నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఈ సందర్భంగా స్థానికులు నాగమ్మ, రూపా, ఫిరోజ్, లక్ష్మీ, వీరేష్, దాదు, భాను, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రథ చక్రాల కింద పడి ఇద్దరు దుర్మరణం

రాయచూరు రూరల్: విజయపుర జిల్లాలో శుక్రవారం సాయంత్రం జరిగిన వేర్వేరు ఘటనల్లో రథ చక్రాల కింద పడి ఇద్దరు దుర్మరణం పాలైన ఘటనలు జరిగాయి. గోల్లాపురలో గోల్లాళేశ్వర రథానికి ఏటా మాదిరిగా కలశం కడుతుండగా కాలు జారి కిందపడిన కాచాపుర సాహెబ్ పటలే ఖాజా పటేల్ (55) గాయపడ్డారు. అతనిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో చనిపోయాడు. మరో ఘటనలో ముద్దేబిహాళ్ తాలూకా బసరకోడులో బసవేశ్వర జాతరలో రథ చక్రం కింద నాగప్ప యల్లప్ప(45) పడడంతో రాతి దూలంతో చేసిన చక్రాల కింది నలిగి మరణించినట్లు పోలీసులు తెలిపారు.

రాంపూర్ రిజర్వాయర్‌లోకి నీటి పంపింగ్



రాంపూర్ రిజర్వాయర్‌లోకి నీటిని నింపుతున్న దృశ్యం

రాయచూరు రూరల్: నగరానికి నీరందించే రాంపూర్ రిజర్వాయర్‌లోకి నగరసభ అధికారులు నీటిని పంపింగ్ చేశారు. నగరవాసులకు వేసవిలో మూడు నెలల పాటు తాగునీటి నిర్వహణకు వీలుగా తుంగభద్ర ఎడమ కాలువకు ఎగువనున్న గణేకల్ రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేసి దిగువనున్న రాంపూర్ రిజర్వాయర్‌లో నింపుతున్నట్లు తెలిపారు.

ప్రచార పోస్టర్ల తొలగింపు



గోడపై పోస్టర్లను తొలగించిన దృశ్యం

కంప్లి: ఎన్నికల నియమావళి ప్రకటించినప్పటి నుంచి గోడలు, భవనాలపై ప్రచార పోస్టర్లను తొలగించడంలో మున్సిపల్ సిబ్బంది నిమగ్నులయ్యారు. రాజకీయ పార్టీల ప్రణాళికలను అతికించిన ప్రాంతాలను వెతికిమరీ తొలగించి సున్నం పూస్తున్నారు. అందమైన గోడలపై పార్టీల గుర్తులు, పేర్లు గల పోస్టర్లు అంటించడంతో మున్సిపల్ సిబ్బందికి తలనొప్పిగా పరిణమించాయి.

ఇంటింటా ముమ్మర ప్రచారం



ప్రచారం చేస్తున్న దీపా సురేష్‌బాబు

కంప్లి: నియోజకవర్గంలోని శాంతినగర్‌లో శుక్రవారం రాత్రి మాజీ ఎమ్మెల్యే సురేష్‌బాబు, అతని భార్య దీపా సురేష్‌బాబు ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ ప్రముఖులు గుత్తిగనూరు విరుపాక్షిగౌడ, యర్రంగళి తిమ్మారెడ్డి, కార్యకర్తలు, మహిళా అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ ఫోన్ల రికవరీపై ప్రశంసలు

హుబ్లీ: ఆధునిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకొని చోరీకి గురైన కోటి రూపాయల మొబైల్ ఫోన్లను హుబ్లీ ధార్వాడల్లో సొంత దారులకు తిరిగి ఇప్పించిన పోలీసుల పనితనాన్ని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి మెచ్చుకుంటూ ట్వీట్ చేశారు. సమాజానికి పోలీసుల సేవలు అత్యవసరమన్నారు. మొబైల్ పోగొట్టుకున్నవారు, చోరీకి గురైన వారు ఈ-స్పందన, సీఐఈఆర్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. జంట నగరాల్లో డీజీ, ఐజీపీ ప్రవీణ్ సూద్ సమక్షంలో వారసుదారులకు ఫోన్లను అప్పగించడం చక్కటి కార్యక్రమం అని, పోగొట్టుకున్న మొబైల్ ఐఎంఈఐ సంఖ్య ద్వారా దాన్ని కనుగొనడానికి ప్రజలు సహకరించాలని ఆయన తెలిపారు.

ప్రైవేట్ కొలువు.. పాడి దరువు

- గిర్ ఆవు లీటరు పాల ధర రూ.100 పైమాటే
- రూ.4 వేలు పలుకుతున్న స్వదేశీ ఆవు నెయ్యి
- పాల విక్రయంతో లాభాల బాటలో బసవరాజ్ చిరుతనాళ



పొలంలోని కొట్టంలో కట్టేసి ఉన్న గిర్ జాతి ఆవులు



గిర్ జాతి ఆవు పాలను పితుకుతున్న బసవరాజ్(ఎడమ)

సాక్షి,బళ్లారి: కాలానుగుణంగా విద్యావంతులు, ఉద్యోగాలు చేస్తున్న వారు వ్యవసాయం, పాడి పరిశ్రమ వైపు ఆసక్తి చూపుతూ విజయతీరాలకు చేరుతున్నారు. జిల్లాలోని దేశంలో పేరుగాంచిన ప్రైవేటు స్టీల్ కంపెనీలో పని చేస్తూ నెలకు రూ.లక్షకు పైగా సంపాదించే నగరానికి చెందిన బసవరాజ్ చిరుతనాళ అనే ఓ ఉద్యోగి వ్యవసాయం, పాడి పరిశ్రమలో మంచి ఆదాయం గడిస్తున్నారు. తనకు నెలకు రూ.లక్షకు పైగా జీతం వస్తున్నా మన సంస్కృతి వారసత్వాలకు అద్దం పట్టేలా నాలుగేళ్ల క్రితం తాలూకాలోని కప్పగల్ వద్ద నాలుగు ఎకరాల భూమిని కొనుగోలు చేయడంతో పాటు పాడి పరిశ్రమను అభివృద్ధి చేస్తున్నారు.

ఉదయం 5కే దినచర్య షురూ..

నిత్యం ఉదయం 5 గంటలకే నిద్ర లేచి తానే స్వయంగా పొలానికి వెళ్లి పాలు పితికి మార్కెట్‌కు పంపించడం తన దినచర్య. తన పొలంలో పశువులకు మేత కోసం మంచి రకం గడ్డిని వేయడంతో పాటు సేంద్రియ పద్ధతుల్లో వివిధ రకాల పంటలు పండిస్తున్నారు. పాడి పరిశ్రమపై ఎంతో ఆసక్తితో రాజస్థాన్ నుంచి ఒక్కో గిర్ జాతి ఆవును దాదాపు రూ.2 లక్షలు వెచ్చించి తీసుకు వచ్చి పాడి పరిశ్రమను స్థాపించారు. నేడు దినదినాభివృద్ధి చెందుతూ 15కు పైగా గిర్ జాతి ఆవులకు పెరిగింది. తరచుగా ఇక్కడ పెరుగుతున్న ఆవులను అమ్ముతూ అధిక లాభాలు ఆర్జిస్తున్నారు.

నాణ్యమైన పాల ఉత్పత్తే ధ్యేయం..

గిర్ జాతి ఆవు పాలను కల్తీ లేకుండా చుక్క నీరు కూడా కలపకుండా అమ్ముతుండటంతో ఒక్కో లీటరు పాలను రూ.100లకు పైగా ధరకు కొనుగోలు చేస్తున్నారు. ఈ సందర్భంగా బసవరాజ్ చిరుతనాళ సాక్షితో మాట్లాడుతూ తాను ఇష్టంగా భావించే పనుల్లో ముందు వరుసలో వ్యవసాయం, పాడి పరిశ్రమ అని తెలిపారు. తనకు ఫ్యాషన్‌గా ఉన్న పాడి పరిశ్రమను పెంపొందించి ఆరోగ్యకరమైన పాలను ఉత్పత్తి చేయాలన్న సంకల్పంతో ఎలాంటి కల్తీ లేకుండా, స్వదేశీ గిర్ జాతి ఆవులతో నాణ్యమైన పాలను ఉత్పత్తి చేస్తున్నామన్నారు.

నిత్యం 25 లీటర్ల పాల ఉత్పత్తి..

ప్రతి రోజు దాదాపు 25 లీటర్లకు పైగా పాలు ఉత్పత్తి అవుతున్నాయన్నారు. ఒక లీటర్ గిర్ జాతి ఆవు నెయ్యి ధర మార్కెట్‌లో రూ.4 వేలు పలుకుతోందన్నారు. గిర్ జాతి ఆవు పాలకు మంచి గిరాకీ ఉందన్నారు. ప్రతి రోజు ఉదయం 5 గంటలకు లేచి పొలానికి వెళతానన్నారు. పాలు పితికిన తర్వాత 7 గంటలకు ఇంటికి వచ్చి ఉద్యోగానికి వెళతానన్నారు. తన ద్వారా మరో నాలుగు కుటుంబాలకు కూడా ఉపాధి కల్పిస్తున్నానన్నారు.

ఐదు చోట్ల గెలుపు మనదే

- ఎమ్మెల్యే సోమలింగప్ప విశ్వాసం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ తదితరులు

బళ్లారి అర్బన్: వచ్చే ఎన్నికల్లో జిల్లాలో ఐదు నియోజకవర్గాల్లో బీజేపీ అభ్యర్థులు ఘనవిజయం సాధిస్తారని సిరుగుప్ప ఎమ్మెల్యే సోమలింగప్ప విశ్వాసం వ్యక్తం చేశారు. శనివారం తాళూరు రోడ్డు గోవిందప్ప కళ్యాణ మంటపంలో నిర్వహించిన కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. కార్యకర్తలు ఎన్నికల సమయంలో ఐకమత్యం, పట్టుదలతో అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన అభివృద్ధి పనులపై కార్యకర్తలు ఇంటింటా ప్రచారం చేయాలన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షులు మురహరగౌడ కార్యకర్తలకు బాధ్యతలను అప్పగించి తమకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వైఎం సతీష్, బుడా అధ్యక్షులు మారుతీ ప్రసాద్, బీజేపీ ప్రముఖులు సిద్దేశ్ యాదవ్, రామలింగప్ప, విరుపాక్షి గౌడ, అనిల్ నాయుడు, కేఎస్. అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల దొంగలనే అనుమానంతో దాడి

- ఇద్దరు యువకులకు దేహశుద్ధి
- కారుకు నిప్పు పెట్టిన గ్రామస్తులు

సాక్షి,బళ్లారి: చిన్నపిల్లలను దొంగలించే వారు వస్తున్నారని బాగలకోటె జిల్లాలో పలు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం జరగడంతో అమాయకులపై దాడి జరగడంతో పాటు వారు ప్రయాణిస్తున్న వాహనం అగ్నికి ఆహుతైన ఘటన శనివారం బాగలకోటె జిల్లా ఖచ్చిదోణి గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు బాగలకోటె నివాసులు రాహుల్, కిరణ్ అనే యువకులు కేఏ-25 ఎంసీ-2832 అనే నంబరుగల నల్లరంగు కారులో ముధోళ తాలూకా కేడిబుద్ని గ్రామంలోని తమ స్నేహితులను కలిసేందుకు వెళ్లారు. కారులో ఒక వ్యక్తి వికారంగా ఉండటంతో పాటు సిగరెట్ తాగుతూ అనుమానాస్పదంగా సంచరిస్తుండటంతో అనుమానం వచ్చిన గ్రామస్తులు ఒక్కసారిగా దాడికి ప్రయత్నించారు. దీంతో ఆ యువకులు తప్పించుకునేందుకు కారుతో వేగంగా దూసుకెళ్లారు. ఈనేపథ్యంలో ఆ గ్రామస్తులు ముందు ఉన్న గ్రామంలోని స్నేహితులకు ఫోన్ చేసి చిన్నారులను అపహరించే దొంగలు వచ్చారని, తప్పించుకుని కారులో మీ ఊరుకి వస్తున్నారని సమాచారం ఇస్తూ కారు నంబరుతో సహా చెప్పడంతో గ్రామస్తులు వారిని పట్టుకునేందుకు సిద్ధమయ్యారు. తమ ఊరిలోకి రాగానే కారును అడ్డగించి అందులో ఉన్న వారిని కిందకు దింపి విచక్షణారహితంగా కొట్టి కారుకు నిప్పు పెట్టారు. ఈ విషయం పోలీసులకు తెలియడంతో ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కారులోని యువకులు చిన్నపిల్లల దొంగలు కాదు, తమ స్నేహితులను కలిసేందుకు వచ్చారని వారించారు. గాయపడిన యువకులను ఆస్పత్రికి తరలించారు. అప్పటికే కారు పూర్తిగా కాలిపోగా ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

పార్టీ అభ్యర్థికి సహకరించం

గంగావతి: అసెంబ్లీ స్థానానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని ఖరారు చేసి ప్రకటించడంతో టికెట్ ఆశావహుల్లోఅసమ్మతి సెగలు భగ్గుమన్నాయి. ఈ స్థానానికి ఆ పార్టీ ఇక్బాల్ అన్సారీకి టికెట్ కేటాయించడంతో రేస్‌లో ఉన్న మరో అభ్యర్థి హెచ్‌ఆర్ శ్రీనాథ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు తాను ప్రచారం చేసే ప్రసక్తే లేదని ప్రకటించారు. కాగా బీజేపీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యే అభ్యర్థులు వేర్వేరు సమయాల్లో మాజీ ఎంపీ హెచ్‌జీ రాములు, మాజీ ఎమ్మెల్సీ హెచ్‌ఆర్ శ్రీనాథ్‌లను కలిసి తమకు మద్దతు ఇవ్వాలని రహస్యంగా మంతనాలు జరిపినట్లు సమాచారం.

కేసు నమోదుకు డిమాండ్

రాయచూరు రూరల్: హిందూ మతాన్ని అవమానించిన ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని జేడీఎస్ పార్టీ జిల్లాధ్యక్షుడు విరుపాక్షి డిమాండ్ చేశారు. ఆయన శనివారం పాత్రికేయుల భవనంలో విలేకరులతో మాట్లాడారు. ఇటీవల ఫోన్ సంభాషణలో నేనే మోదీ, నేనే ట్రంప్, నేనే దేవుడని చేసిన వ్యాఖ్యలపై పశ్చిమ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదుకు చర్యలు చేపట్టాలన్నారు.

టికెట్ ఇవ్వాలని ర్యాలీ



ఆందోళన చేస్తున్న కార్యకర్తలు

రాయచూరు రూరల్: లింగసూగూరు నియోజకవర్గం కాంగ్రెస్ టికెట్‌ను మాదిగలకు ఇవ్వాలని మాదిగ సమాజం కార్యకర్తలు డిమాండ్ చేశారు. శనివారం లింగసూగూరులో సాంఘీక న్యాయ పోరాట నేతలు విజయ కుమార్ మాట్లాడుతూ ఎస్సీలకు రిజర్వ్ అయిన లింగసూగూరులో మాదిగ సమాజాన్ని అవమాన పరుస్తుండడాన్ని ఖండిస్తూ మెడకు కుండలు, వీపునకు చీపుర్లను కట్టుకొని నిరసన తెలిపారు.

స్వతంత్ర అభ్యర్థిగా కళస పోటీ

రాయచూరు రూరల్: నగరానికి అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ(ఎయిమ్స్) మంజూరులో నిర్లక్ష్యం వహించిన పార్టీలను ఓడించడానికి పోరాట సమితి ప్రధాన సంచాలకుడు బసవరాజ కళస వచ్చే ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు సమితి సంచాలకుడు అశోక్ కుమార్ జైన్ తెలిపారు. శనివారం పాత్రికేయుల భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ఏడుగురు ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎమ్మెల్సీలు, ఇద్దరు ఎంపీలు, 35 మంది కౌన్సిలర్లున్నా ఏనాడూ ఎయిమ్స్ గురించి ప్రస్తావించకపోవడం శోచనీయమన్నారు.

వైభవంగా రథోత్సవం



అశేష సంఖ్యలో పాల్గొన్న భక్తులు

రాయచూరు రూరల్: నగరంలోని ఐబీ రోడ్డులో రామలింగేశ్వర స్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. శుక్రవారం రాత్రి వేలాది మంది భక్తుల సమక్షంలో రథాన్ని లాగారు. నగరంలో వెలసిన రామలింగేశ్వర ఆలయంలో సోమవారపేట మఠాధిపతి అభినవ రాచోటి శివాచార్య, శాంతమల్ల శివాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. వీరశైవ సమాజం జిల్లాధ్యక్షుడు వీరనగౌడ, ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్, మాజీ ఎమ్మెల్యే బోసురాజ్ తదితరులతో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కేఆర్‌పీపీలోకి చేరిక



కండువా కప్పి ఆహ్వానిస్తున్న గాలి జనార్దన్‌రెడ్డి

గంగావతి: కెసరహట్టి గ్రామంలో కేఆర్‌పీపీ సంస్థాపకులు గాలి జనార్దన్‌రెడ్డి సమక్షంలో మాజీ జెడ్పీ మెంబర్ మంజునాథ్ ఆ పార్టీలో చేరారు. ఈ ప్రాంత ఓటర్లలో పట్టున్న నాయకుడి చేరికతో పార్టీకి బలం చేకూరినట్లయిందని జనార్దన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

నీటి నిలిపివేతతో గుబులు

గంగావతి రూరల్: కనకగిరి నియోజకవర్గంలో తుంగభద్ర ఎడమ కాలువ కింద హణవాళ 25వ డిస్ట్రిబ్యూటరీకి శనివారం కనకగిరి తహసీల్దార్, పోలీసు సిబ్బందితో కలిసి గేట్లను పూర్తిగా మూసేసి నీటి సరఫరా నిలిపేయడంతో చేతికొచ్చిన పంట నోటికి రాకుండా పోతుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కాంగ్రెస్‌లోకి వలస

గంగావతి: కురుబ సమాజ ప్రముఖ నేతలు మాజీ మంత్రి, కాంగ్రెస్ అభ్యర్థి ఇక్బాల్ అన్సారీ సమక్షంలో శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. విఠ్లాపుర యమునప్ప, ఏపీఎంసీ మాజీ అధ్యక్షులు సన్నక్కి నీలప్పలను తన నివాసంలో అన్సారి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఇక్బాల్ అన్సారి మాట్లాడుతూ తనకు అన్ని సమాజాల ప్రజలు మద్దతిస్తారన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

ఘనంగా కోదండరామ రథోత్సవం



పాల్గొన్న విద్యారణ్య భారతీ స్వామీజీ తదితరులు

హొసపేటె: హంపీలో తుంగభద్ర నదీ తీరాన వెలిసిన రాయల కాలం నాటి కోదండరామ దేవస్థాన రథోత్సవం శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. హంపీ విరుపాక్షేశ్వరస్వామి ఆలయ రథోత్సవం జరిగిన మూడో రోజు కోదండరాముని రథోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఉదయం కోదండరామ ఆలయంలో స్వామి వారికి జలాభిషేకం, ఆకుపూజ, మహామంగళారతి, నైవేద్య సమర్పణ తదితర పూజలను వేదపండితులు ఘనంగా జరిపారు. హంపీ విద్యారణ్య భారతీ స్వామీజీతో పాటు ఆలయంలో ఉన్న ఏనుగును వివిధ వాయిద్య మేళతాళాలతో ఊరేగించారు. అనంతరం స్వామివారి ఉత్సవ మూర్తిని రథంలో ప్రతిష్ఠించి అశేష భక్తజనుల మధ్య రథోత్సవాన్ని నిర్వహించారు. భారీ సంఖ్యలో భక్తులు రథోత్సవంలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

బీజేపీ గూటికి నాగరాజ్ చబ్బి?



నాగరాజ్ చబ్బి(ఫైల్)

హుబ్లీ: కలఘటిగి అసెంబ్లీ టికెట్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్న కాంగ్రెస్ అభ్యర్థి నాగరాజ్ చబ్బికి ఆ టికెట్ ఇవ్వకుండా గనుల యజమాని సంతోష్ లాడ్‌కు కాంగ్రెస్ కేటాయించడంపై నాగరాజ్ చబ్బి తీవ్రంగా మండిపడుతున్నారు. మీడియాతో స్పందించిన ఆయన తన చిత్తశుద్ధిని పార్టీ నేతలు గుర్తించలేదన్నారు. పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశానన్నారు. దీంతో తాను ఆదివారం రాజీనామా సమర్పిస్తానన్నారు. అలాగే బీజేపీలో చేరికపై కార్యకర్తలతో చర్చించాక రెండు రోజుల్లో తగిన నిర్ణయం తీసుకుంటానన్నారు. కాగా కాంగ్రెస్ టికెట్‌పై సంతోష్‌లాడ్, నాగరాజ్ చబ్బి మధ్య తీవ్ర పోటీ నెలకొంది. సిద్దరామయ్య, డీకే.శివకుమార్ వర్గంలో గుర్తింపు పొందిన సంతోష్‌లాడ్‌కు టికెట్ కేటాయించడంతో నాగరాజ్ చబ్బికి మింగుడు పడటం లేదు.

కోలారు వార్తలు...

బీఎస్ఎఫ్ యోధుల కవాతు



కవాతు నిర్వహిస్తున్న బీఎస్ఎఫ్ జవాన్లు

శ్రీనివాసపురం: అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా బీఎస్ఎఫ్ జవాన్లు స్థానిక పోలీసులతో కలసి శనివారం పట్టణంలోని ప్రధాన వీధుల్లో కవాతు నిర్వహించారు. ప్రజలు జవాన్లపై పూలవర్షం కురిపించి స్వాగతం పలికారు. ఎంజీ రోడ్డులో పునీత్ రాజ్‌కుమార్ అభిమానుల సంఘం సభ్యులు జవాన్లకు స్వీట్లు, చల్లని పానీయాలు అందించారు. కవాతులో తాలూకా ఎన్నికల అధికారిణి ఆర్‌బీ నందిని, తహసీల్దార్ శిరీన్‌తాజ్, డీఎస్పీ జయశంకర్, పోలీస్ ఇన్‌స్పెక్టర్లు జేసీ నారాయణస్వామి, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

5 కిలోల వెండి స్వాధీనం

శ్రీనివాసపురం: ముళబాగిలు తాలూకా రామసంద్ర రోడ్డులోని గోకుంట చెక్‌పోస్టు వద్ద 5 కిలోల వెండి ఆభరణాలను రూరల్ ఎస్ఐ విఠల్ వై.తళవార్, పోలీసు సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని రామసంద్రం మండలం గుంట్లపేటకు చెందిన వైఎస్ మణికంఠ, నాగరాజ్‌లు 5 కిలోల వెండి ఆభరణాలను బెంగళూరుకు రిపేరీ నిమిత్తం తరలిస్తుండగా ఎలాంటి దాఖలాలు లేకపోవడంతో వాటిని సీజ్ చేశారు. ముళబాగిలు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

గంజాయి స్వాధీనం

- నిందితుని అరెస్ట్



పట్టుబడిన నిందితునితో పోలీసులు

కోలారు: గంజాయిని తరలిస్తున్న నిందితుడు నగరంలోని జమాల్‌షా నగర్‌కు చెందిన సయ్యద్ గౌస్‌ను అరెస్ట్ చేసిన గల్‌పేట పోలీసులు రూ.1.5 లక్షల విలువ చేసే 2.28 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం రాత్రి శ్రీనివాసపుర నుంచి నగరంలోకి తన బైక్‌పై వస్తుండగా శ్రీనివాసపుర సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద నిందితుడి వాహనాన్ని ఆపి తనిఖీ చేసిన గల్‌పేట పోలీసులకు వాహనంలో గంజాయి లభించింది. వెంటనే నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు గంజాయిని, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. గల్‌పేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

రూ.500 కోట్లతో అభివృద్ధి పనులు చేశాం

కేజీఎఫ్: గత ఐదేళ్లలో నియోజకవర్గంలో రూ.500 కోట్లతో అభివృద్ధి పనులు చేసినట్లు ఎమ్మెల్యే రూపా శశిధర్ తెలిపారు. శనివారం మారికుప్పంలో ఎన్నికల ప్రచారంలో ఆమె మాట్లాడారు. కేజీఎఫ్ కొత్త తాలూకాగా ఏర్పడిన తరువాత రూ.10 కోట్లతో పరిపాలన భవనం, ఆస్పత్రి ఆధునీకరణ, రూ.2 కోట్లతో టీపీ భవనంతో పాటు కేజీఎఫ్‌లో రూ.100 కోట్లతో అభివృద్ధి పనులను నిర్వహించామన్నారు. చేసిన అభివృద్ధిని చూసి వచ్చే ఎన్నికల్లో ఓటు వేసి మరోసారి గెలిపించి మరింతగా అభివృద్ధికి అవకాశం కల్పించాలని కోరారు. తాలూకాలో యువతకు ఉద్యోగాల కల్పన కోసం 974 ఎకరాల్లో పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వంతో చర్చిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు భీమేష్, దశరథరెడ్డి, శివప్ప, పురుషోత్తం రెడ్డి, ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేస్తాం



మాట్లాడుతున్న రవిశంకర్

మాలూరు: వచ్చే ఎన్నికల్లో మాలూరు నుంచి పోటీ చేస్తున్న తాను నియోజకవర్గంలో పార్టీని సంఘటితం చేసి గెలుపునకు శాయశక్తులా కృషి చేస్తానని ఆప్(ఏఏపీ) అభ్యర్థి ఎం.రవిశంకర్ విశ్వాసం వ్యక్తం చేశారు. ఆయన శనివారం లక్కూరులోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అధ్యక్షుడు అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలో పార్టీ రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లోను పోటీ చేస్తోందన్నారు. ప్రజలతో మమేకమైన అభ్యర్థులకే టికెట్లను కేటాయించారన్నారు. తాలూకాలో పార్టీ కార్యకర్తలు 5 బృందాలుగా ఏర్పడి నిత్యం ప్రచారం చేస్తున్నారన్నారు. ప్రజల నుంచి పార్టీకి మంచి స్పందన లభిస్తోందన్నారు.

మతతత్వ పార్టీలను ఓడించండి



మాట్లాడుతున్న బయ్యారెడ్డి

కోలారు: మతతత్వ, పెట్టుబడిదారీ పార్టీలను వచ్చే ఎన్నికల్లో ఓడించాలని, ప్రజా సంక్షేమానికి పెద్ద పీట వేసే వామ పక్షాలకు మద్దతు ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మండలి సభ్యుడు జీసీ బయ్యారెడ్డి తెలిపారు. శనివారం నగరంలోని పాత్రికేయుల భవనంలో పార్టీ జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకోవాలని చూసే పార్టీలకు అవకాశం ఇవ్వకూడదన్నారు. ప్రజా సమస్యలపై పార్టీ నిరంతరం పోరాటాలు చేస్తోందన్నారు. పార్టీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ కె ప్రకాష్ మాట్లాడుతూ దేశంలో మతతత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా పార్టీ ప్రజలను జాగృతం చేస్తోందన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి గాంధీనగర్ నారాయణస్వామి, పీఆర్ సూర్యనారాయణ, టీఎం వెంకటేష్, గీతా పాల్గొన్నారు.

అభివృద్ధికి జేడీఎస్ పెద్ద పీట



మాట్లాడుతున్న వెంకటశివారెడ్డి

శ్రీనివాసపురం: అన్ని వర్గాల అభివృద్ధికి జేడీఎస్ ప్రాధాన్యతనిస్తోందని, వచ్చే ఎన్నికల్లో పార్టీని గెలిపించి కుమారస్వామిని సీఎం చేయాలని మాజీ ఎమ్మెల్యే, పార్టీ అభ్యర్థి జీకే వెంకటశివారెడ్డి అన్నారు. శనివారం రంబిహళ్లిలో ఏర్పాటు చేసిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. జేడీఎస్ పంచరత్న పథకం ద్వారా రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే రమేష్‌కుమార్ వివిధ వర్గాల సమావేశాలు నిర్వహించి వారిని చీల్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. గత పదేళ్లుగా నియోజకవర్గం ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కేవలం తన హయాంలోనే జరిగిందన్నారు. పార్టీ నాయకులు భైరెడ్డి, వెంకటేష్ భైరారెడ్డి, శ్రీనివాస్, నరసింహప్ప తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాగృతి జాతా



జాతా నిర్వహిస్తున్న దృశ్యం

కోలారు: క్యాలనూరులో శనివారం ఓటరు జాగృతి జాతాను నిర్వహించారు. టీపీ ఈఓ పి.మునియప్ప మాట్లాడుతూ ప్రతి వ్యక్తి ఓటు హక్కు విలువ తెలుసుకోవాలనే ఉద్దేశంతో ఈ జాతాను నిర్వహిస్తున్నామన్నారు. ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా ఉత్తమ వ్యక్తులను ఎన్నుకోవాలన్నారు. సజావుగా పోలింగ్ జరగడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. పీడీఓ మునిరాజు, కార్యక్రమ వ్యవస్థాపకులు విజయ్, ఆశా, చైత్రా, తాలూకా ఐఈసీ సంయోజకుడు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు దూసుకెళ్లి చిన్నారి మృతి

సాక్షి,బళ్లారి: చిన్నారిపైకి ఆర్టీసీ బస్సు దూసుకెళ్లడంతో ఘటన స్థలంలోనే చిన్నారి మృతి చెందింది. వివరాలు..శనివారం బెళగావి జిల్లా రాయబాగ తాలూకా పరమానందవాడిలో ఆర్టీసీ బస్సు చిన్నారి అశోక్(2)పై దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తూ బస్సుపైకి రాళ్లు రువ్వి అద్దాలు పగలకొట్టారు. ఘటనపై కుడిచి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

రూ.2.48 లక్షల మద్యం సీజ్



పట్టుబడిన మద్యం బాటిళ్ల వాహనంతో పోలీసులు

రాయచూరు రూరల్: జిల్లాలోని సింధనూరు తాలూకా ఆలబనూరు చెక్‌పోస్టులో పోలీసులు అక్రమంగా కారులో తరలిస్తున్న రూ.2.48 లక్షల విలువ చేసే మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. శనివారం చెక్‌పోస్టులో గస్తీ కాస్తుండగా బూదివాళ బసవేశ్వర ఎంటర్‌ప్రైజెస్ వద్ద కేఏ-33 ఎం-3275 టాటా ఏస్ వాహనాన్ని తనిఖీ చేయగా 155.20 లీటర్ల మద్యం పట్టుబడినట్లు ఎక్సైజ్ ఎస్ఐ తెలిపారు. ఎన్నికల్లో ఓటర్లకు పంచడానికి తరలిస్తున్నట్లు అందిన సమాచారంతో పట్టుకున్నామన్నారు.

చెరువులో బాలుడి మృతదేహం లభ్యం..

నగరంలోని మావినకెరె చెరువులో పడి ఓ బాలుడు మృతి చెందిన ఘటన వెలుగు చూసింది. అశోక్ డిపో వద్ద నివాసముంటున్న ఓ బాలుడి మృతదేహం మూడు రోజుల క్రితం చెరువులోని పూడికలో కుళ్లిన స్థితిలో బయట పడింది. కాగా మృతుడి పేరు, వివరాలు తెలియరాలేదు.

బలగాల కవాతు



కవాతులో పాల్గొన్న బీఎస్ఎఫ్ బలగాలు

గౌరిబిదనూరు: శాసనసభ ఎన్నికలకు భద్రత కోసం బీఎస్ఎఫ్ జవాన్లతో పాటు స్థానిక పోలీసులు నగరంలో శనివారం కవాతు జరిపారు. వివిధ ప్రాంతాల గుండా ప్రదర్శన జరిగింది. ప్రజలు నిర్భయంగా ఓటు వేసేలా మనోధైర్యం కల్పించడమే దీని లక్ష్యమని తెలిపారు. 70 మంది బీఎస్ఎఫ్ సైనికులు నగరానికి రాగా ప్రజలు వారికి పూలు ఇచ్చి స్వాగతించారు. డీఎస్పీ వాసుదేవ్, సీఐ సత్యనారాయణ పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం చాలా పుణ్యకార్యమని ఆదర్శరైతు డా జీఆర్ గోవిందరెడ్డి తెలిపారు. విదురాశ్వత్థం ఉత్సవాల సందర్భంగా దేవాలయం సమీపంలో భక్తులకు అన్నదానం చేశారు. ఉపాధ్యాయుడు చంద్రశేఖరరెడ్డి ఈ అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

క్లుప్తంగా

దివ్యాంగులకు వీల్‌చైర్ పోటీలు

మైసూరు: దివ్యాంగ మైత్రి స్పోర్ట్స్ అకాడమి, తుమకూరు జిల్లా దివ్యాంగ స్పోర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో నమ్మనిధి ట్రస్టు సహకారంతో దివ్యాంగులకు వీల్‌చైర్ క్రికెట్ టోర్నీ శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ప్రారంభమైంది. రెండు రోజులపాటు జరిగే పోటీలకు తుమకూరు జిల్లాతోపాటు ఇతర ప్రాంతాలనుంచి నాలుగు జట్లు పాల్గొంటున్నాయి.

రౌడీలను లేకుండా చేశా

బాగేపల్లి: తాను ఎమ్మెల్యే అయిన తరువాత నియోజకవర్గంలో ఎక్కడా రౌడీయిజం అనేది లేకుండా అణచివేయడంతో పాటు రాజకీయ గొడవలు లేకుండా చేసినట్లు ఎమ్మెల్యే ఎస్.ఎన్ సుబ్బారెడ్డి అన్నారు. శనివారం బిల్లలూరు, చాకవేలు, పులగల్లు గ్రామాల్లో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు పార్టీలో చేరారు. బాగేపల్లిలో ఎక్కడా కూడా కుల రాజకీయం లేదన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడంతో పాటు ఇక్కడ రౌడీషీటర్లు లేకుండా చేసిన ఘనత తనదేనని అన్నారు.

నేత్రపర్వంగా రాములోరి పట్టాభిషేకం



సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయ స్వామిని అలంకరించిన దృశ్యం

తుమకూరు: శిరా తాలూకా, తావరెకెరె గ్రామంలోని రామాలయంలో శనివారం శ్రీరామ పట్టాభిషేక మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాముల విగ్రహాలను విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

కారు అద్దాలు పగలగొట్టి చోరీ

దొడ్డబళ్లాపురం: కారు విండో గ్లాస్ పగలగొట్టి నగదు,ల్యాప్‌టాప్ చోరీ చేసిన ఘటన నెలమంగల పట్టణ పరిధిలో చోటుచేసుకుంది. నెలమంగల పట్టణం అంబేడ్కర్ నగర్ నివాసి నాగరాజ్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. ఈయన స్విఫ్ట్ కారును బస్టాండ్ సమీపంలో గురుభవన్ వద్ద నిలిపి పని నిమిత్తం వెళ్లాడు. ఈసమయంలో దుండగులు కారు అద్దాలు పగలగొట్టి రూ.1.82 లక్షల నగదు, ల్యాప్‌టాప్, ఏటీఎం కార్డులు, పలు కీలక డాక్యుమెంట్లు చోరీ చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఆప్ అభ్యర్థి ఎన్నికల ప్రచారం



ఓటు అభ్యర్థిస్తున్న నటరాజ్

కృష్ణరాజపురం: నగరంలోని మహాదేవపుర నియోజకవర్గంలో ఆమ్‌ఆద్మీ అభ్యర్థి నటరాజ్ శనివారం తమ మద్దతుదారులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రోడ్‌షో, బైకు ర్యాలీ ద్వారా ఓటర్లను ఆకట్టుకున్నారు. అధికారంలోకి వస్తే ఉచిత విద్య, వైద్య సదుపాయాలు కల్పిస్తామని, ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని కోరారు.

రూ.10 లక్షల మద్యం పట్టివేత

దొడ్డబళ్లాపురం: దేవనహళ్లి తాలూకా యలియూరులోని సీఎల్-2 మద్యం షాపుపై అబ్కారీ అధికారులు దాడి చేశారు. లెక్కాపత్రం లేని రూ.10లక్షల విలువైన 1,192 లీటర్ల మద్యం, 1,388 లీటర్ల బీరు స్వాధీనం చేసుకొని మద్యం షాపు యజమాని సుధాకర్‌పై కేసు నమోదుచేశారు.

చీరలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న క్యాంటర్ వాహనం

యశవంతపుర: రాజాజీనగర ఐదో బ్లాక్ దోబీఘాట్ సమీపంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద అధికారులు తనిఖీలు నిర్వహించారు. అటుగా వచ్చిన క్యాంటర్ వాహనాన్ని సోదా చేయగా పూణె నుంచి బెంగళూరుకు పెద్ద సంఖ్యలో చీరలు రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. వీటికి ఎలాంటి దాఖలాలు లేకపోవడంతో చీరలతోపాటు వాహనాన్ని వాణిజ్యశాఖ అధికారులకు అప్పగించారు.

ఆర్‌ఏఎఫ్ కవాతు



యశవంతపుర: శాంతియుత ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఆర్‌ఏఎఫ్‌కు చెందిన మూడు బెటాలియన్లు బెంగళూరుకు చేరుకున్నాయి. శనివారం ఉదయం బెంగళూరు ఉత్తర విభాగంలోని మహాలక్ష్మి లేఔట్, నందినిలేఔట్ పోలీసుస్టేషన్ పరిధిలో గొరెయర బళగ, సరస్వతీపురం మొయిన్ రోడ్డు, నందినిలేఔట్, జైమారుతీనగరలో బలగాలు కవాతు నిర్వహించాయి.

రంజాన్ ఘుమఘుమలు



విద్యుత్ వెలుగుల్లో రంజాన్ ఫుడ్ మేళా



ఫుడ్ మేళాలో వివిధ రకాల వంటకాలు



ఆరోగ్యాన్నిచ్చే వివిధ రకాల జ్యూస్‌లు

- శివాజీనగరలో నోరూరించే వంటకాలు
- సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు సందడి

శివాజీనగర: రంజాన్ పర్వదినం వస్తోందంటే సాయంత్రం ఉపవాస విరమణ తరువాత ఆరగించేందుకు వైవిధ్యమైన వంటకాలు సిద్ధంగా ఉంటాయి. ముస్లింలే కాదు ఇతరులు కూడా ఇక్కడి వంటకాలను ఉత్సాహంగా రుచి చూస్తుంటారు. బెంగళూరు శివాజీనగర రంజాన్ రాకతో కళకళలాడడం ఆనవాయితీ. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉపవాస దీక్షను ఆచరించడం వల్ల ఇఫ్తార్ తర్వాత ఆహార సేవనానికి ప్రాధాన్యమిస్తారు. దీంతో రాత్రి సమయాల్లో ప్రత్యేక ఫుడ్ కోర్టులు వెలిశాయి.

వైవిధ్యమైన వంటకాలు

సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు ఇక్కడ వంటకాలను విక్రయిస్తారు. మళ్లీ తెల్లవారుజామున 3 గంటల నుంచి ఉపవాసానికి సిద్ధమయ్యేవారి కోసం ఆహారశాలలు తెరుస్తారు. ఇవే కాకుండా వీధుల్లో పండ్ల సలాడ్‌లు, డ్రింక్‌లు, మాంసాహార వంటకాల వ్యాపారులు కూడా స్టాళ్లను ఏర్పాటు చేసి విక్రయిస్తుంటారు. శివాజీనగరతో పాటు ముస్లింలు అధికంగా ఉన్న వీధుల్లో రాత్రంతా సందడి కనిపిస్తూనే ఉంది. నగరంలోని ఫ్రేజర్‌టౌన్, శివాజీనగర, సిటీ మార్కెట్, కోరమంగల తదితర ప్రాంతాల్లో ప్రస్తుతం ఈ నైట్ బజార్‌లు అధికంగా ఉన్నాయి.

అందరికీ ప్రీతిపాత్రం

నోరూరించే ఫుడ్ కోర్టులు ఫ్రేజర్‌టౌన్‌లో వెలిశాయి. ఈ ప్రాంతంలోని మాస్క్ రోడ్డు, ఎం.ఎం.రోడ్డులో రంజాన్ ఫుడ్ మేళాల్లో ముస్లింలే కాదు అన్ని మతాలవారు ఉత్సాహంగా వంటకాలను ఆరగిస్తారు. సాయంత్రం 6 గంటల నుంచి అర్ధరాత్రి వరకు ఈ రోడ్డులో వ్యాపారులు జరుగుతుంటాయి. ఆహార ప్రియులను ఆకర్షించేందుకు మటన్, చికెన్, చేపలు, రొయ్యలు తదితరాలతో వివిధ రకాల పేర్లతో తయారు చేసిన వంటకాలను విరివిగా విక్రయిస్తున్నారు. రంజాన్ మాసానికి ప్రత్యేకమైన హలీమ్, హరీరా, పత్తర్ కా ఘోష్ వంటి వంటకాలు, హైదరాబాద్ బిర్యాని, కబాబ్, తందూరి రుచులు ఇక్కడ లభ్యం. మసీదు రోడ్డులో హైదరాబాదీ హలీమ్, బిర్యానికి డిమాండ్ ఉంది. ఆహారశాలల్లో మాంసాహారాలే కాకుండా వివిధ రకాల పండ్ల రసాలు, విదేశీ జ్యూస్‌లను కూడా అందుబాటులో ఉంచారు.

ఓటింగ్ శాతం పెంపునకు జాగృతి

- బైక్ ర్యాలీ, యక్షగాన నృత్యాలు, నాటకాలతో అవగాహన



యక్షగాన కళాకారులచే అవగాహన



ఓటు హక్కుపై నిర్వహించిన బైక్ ర్యాలీలో జిల్లా ఎన్నికలాధికారి తుషార్ గిరినాథ్, నగర పోలీస్ కమిషనర్ ప్రతాప్‌రెడ్డి

శివాజీనగర: ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఐటీ, బీటీ ఉద్యోగులు ముందుకు రావాలని జిల్లా ఎన్నికలాధికారి తుషార్ గిరినాథ్ పిలుపునిచ్చారు.విధానసభ ఎన్నికల్లో అర్హులందరూ ఓటు హక్కును వినియోగించుకునేలా అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రధాన ఎన్నికలాధికారి కార్యాలయ సూచనలతో బెంగళూరులోని చర్చ్ స్ట్రీట్‌లో శనివారం ఏర్పాటు చేసిన ఓట్ ఫెస్ట్ (ఓటింగ్ పండుగ) కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి ఆయన మాట్లాడారు. ప్రతిసారి బెంగళూరులో తక్కువ స్థాయిలో ఓటింగ్ జరుగుతోందన్నారు. ఈ సారి ఓటింగ్ శాతం పెంచేందుకు కొత్తగా ఓటు హక్కు పొందిన 1.20 లక్షల మంది పోలింగ్ కేంద్రాలకు రావాలన్నారు. అదేవిధంగా ఐటీబీటీ కంపెనీలు పోలింగ్ రోజు సెలవు ప్రకటించి లక్షలాదిగా ఉన్న ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రోత్సహించాలన్నారు. బెంగళూరు నగర పోలీస్ కమిషనర్ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచస్థాయి నగరమైన బెంగళూరులో గరిష్ఠ స్థాయిలో ఓటింగ్‌ను నమోదు చేసే లక్ష్యాన్ని సాధించాలన్నారు. అనంతరం బైక్ ర్యాలీ, యక్షగానం, ఫ్లాష్ మాబ్‌తో పాటు వివిధ కార్యక్రమాల ద్వారా ప్రజలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బెంగళూరు నగర జిల్లాధికారి దయానంద్, అదనపు ప్రధాన ఎన్నికలాధికారి రాజేంద్ర చోళన్, ప్రత్యేకాధికారి సూర్యసేనా తదితరులు పాల్గొన్నారు.

చాకుతో టాటా ఏస్ డ్రైవర్ హల్‌చల్



చాకుతో బెదిరిస్తున్న టాటా ఏస్ వాహన డ్రైవర్

యశవంతపుర: ఫోన్‌లో మాట్లాడుతూ వాహనం నడుపుతుండటాన్ని ప్రశ్నించిన బైకిస్టుపై టాటా ఏస్ వాహన డ్రైవర్ చాకుతో బెదిరిస్తూ నడిరోడ్డుపై హల్‌చల్ చేశాడు. బెంగళూరు రామమూర్తి వంతెన వద్ద తండ్రితో కలిసి ప్రకాశ్ అనే వ్యక్తి బైకులో వెళ్తుండగా టాటా ఏస్ వేగంగా ఢీకొంది. అదే సమయంలో డ్రైవర్ ఫోన్‌లో మాట్లాడుతున్నాడు. దీనిని గమనించిన ప్రకాశ్ ఫోన్‌ల్లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం తప్పంటూ మందలించాడు. ఆక్రోశానికి గురైన డ్రైవర్ చాకు బయటకు తీసి బెదిరించాడు. ఈ ఘటనపై ప్రకాశ్ ట్విట్టర్‌లో తన ఆవేదనను వెళ్లగక్కాడు. దీనిని సీరియస్‌గా తీసుకున్న రామమూర్తినగర పోలీసులు టాటా ఏస్ డ్రైవర్ కోసం తీవ్రంగా గాలిస్తున్నారు.

ఇంటి ఖర్చులకు చోరీలు

- నిందితుడి అరెస్ట్, లారీ స్వాధీనం

యశవంతపుర: ఇంటి ఖర్చుల కోసం వాహనాలను అపహరిస్తున్న తమిళనాడుకు చెందిన దీన్ దయాళన్ అనే దొంగను పోలీసులు అరెస్టు చేశారు. ఈ నెల 6న గొట్టిగెరె సమీపంలో రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీ చోరీకి గురైంది. పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితుడు దీన్ దయాళన్‌ను అరెస్ట్ చేసి అతని వద్దనుంచి రూ.35లక్షల విలువైన లారీని స్వాధీనం చేసుకున్నారు. కాగా తనకు ఇద్దరు భార్యలున్నారని, పెద్ద భార్యకు ఇల్లు కట్టించానని, ఇంటి ఖర్చులకు డబ్బు లేక చోరీలకు పాల్పడుతున్నట్లు నిందితుడు వెల్లడించాడని పోలీసులు తెలిపారు.

మత్తులో మర్మాంగాన్ని కోసుకున్నాడు



చికిత్స పొందుతున్న రాజశెట్టి

మైసూరు: మద్యం మత్తులో మర్మాంగాన్ని కోసుకున్న వ్యక్తి ఉదంతం మైసూరు జిల్లా హుణసూరు తాలూకా తొండాలు గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గోవిందశెట్టి కుమారుడు రాజశెట్టి శుక్రవారం రాత్రి బార్‌కు వెళ్లి అతిగా మద్యం సేవించాడు. మత్తులోనే కత్తితో మర్మాంగాన్ని కోసుకొని బాధ తాళలేక కేకలు వేశాడు. పక్కనే ఉన్నవారు గమనించి ఆస్పత్రికి తరలించారు.

మూసివేయించాలి

శివమొగ్గ: శివమొగ్గ నగర సమీపంలోని సోగానే విమానాశ్రయంపై కమలం చిహ్నాన్ని బట్టతో మూసివేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శివమొగ్గ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఎన్నికలకోడ్ అమలులో ఉన్నందున కమలం చిహ్నం ప్రజలకు కనిపించకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

చారుకీర్తి భట్టాచార స్వామీజీకి నివాళులు

మైసూరు: ఇటీవల కన్నుమూసిన చారుకీర్తిభట్టార స్వామీజీకి శనివారం శ్రావణ బెళగొళ జైన మఠంలో వినయాంజలి కార్యక్రమం జరిగింది. ఆయన చిత్రపటానికి ధర్మస్థల ధర్మాధికారి డాక్టర్ వీరేంద్ర హెగడె పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ చారుకీర్తి భట్టాచార స్వామీజీ ఆదర్శాలను యువత పాటించాలన్నారు.

ఇంటి స్థలం విషయంలో ఘర్షణ.. ఐదుగురికి గాయాలు



క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

విజయపుర(బెంగళూరు గ్రామీణ) : విజయపుర సమీపంలోని హలియూరు గ్రామంలో రెండు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో ఐదుమంది తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. నారాయణ స్వామి, ముని ఆంజనప్పల ఇళ్లు పక్కపక్కనే ఉన్నాయి. ఇంటి స్థలం విషయంలో చాలా రోజులుగా వివాదం నడుస్తోంది. శనివారం గొడవ జరిగి కర్రలు, రాళ్లతో పరస్పరం దాడులు చేసుకున్నారు. నారాయణ స్వామి(75), వెంకట లక్ష్మమ్మ(75), నటరాజు, వెంకటేష్, నాగరాజులకు తీవ్ర గాయాలు కాగా చిక్కబళ్లాపురం ఆస్పత్రికి తరలించారు.

మిల్క్‌పార్లల్ యజమాని ఆత్మహత్య

మండ్య: అప్పుల బాధతో వ్యాపారి ఆత్మహత్య చేసుకున్నాడు.మద్దూరులోని మళవల్లి రోడ్డులో నివాసం ఉంటున్న పి. కృష్ణప్ప కుమారుడు ఎంకే మధు (26) అదే ప్రాంతంలో మిల్క్ పార్లల్ ఏర్పాటు చేశాడు. వ్యాపారంలో నష్టాలు రావడంతో అప్పులు పెరిగిపోయాయి. దీంతో శనివారం తన ఇంటిలోనే చున్నీతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మద్దూరు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

కారు దూసుకెళ్లి వ్యక్తి మృతి

చింతామణి: కారు దూసుకొచ్చి వ్యక్తి మరణించిన ఘటన రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని చిన్నసంద్ర గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. చిన్నసంద్ర ప్రాంతానికి చెందిన బషీర్ (50) శనివారం రోడ్డు పక్కన నిలబడి ఉండగా బెంగళూరు నుంచి వస్తున్న కారు అదుపు తప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లి బషీర్‌ను ఢీకొంది. ప్రమాదంలో అతను మృతి చెందాడు. పోలీసులు కారును స్వాధీనం చేసుకొని కేసు దర్యాప్తు చేపట్టారు.

రాజకీయ నేతలకు ప్రవేశం లేదు

- బ్యానర్ ఏర్పాటు చేసిన గ్రామస్తుడు



ఇంటి గేట్‌కు బ్యానర్ అమర్చిన దశ్యం

బనశంకరి: నేతలు హామీలు అమలు చేయలేదు. సమస్యలు పరిష్కారం కాలేదు. దీంతో రాజకీయ నేతలు ఎవరూ తన ఇంటి ఆవరణలోకి రావద్దని ఓ వ్యక్తి బ్యానర్ ఏర్పాటు చేశాడు. సుళ్య తాలూకా అజ్జావరలో ముండోళి మూలే అనే వ్యక్తి రోడ్డు పనులకు అవసరమైన మట్టిని తన వ్యవసాయ భూమి నుంచి ఇచ్చారు. అయితే రోడ్డుకు వేసిన మట్టి వర్షాకాలంలో వెనక్కి వచ్చి డ్రైనేజీలో పేరుకుపోయింది. పూడిక తీయాలని ఎన్నిసార్లు విన్నవించినా అధికారులు కానీ, ప్రజాప్రతినిధులు కాని చెవికెక్కించుకోలేదు. అంతేగాకుండా గంగా కళ్యాణ పథకం ద్వారా నీటి ఎద్దడి తీర్చుతామని ఎమ్మెల్యే ఇచ్చిన హామీ అమలు కాలేదు. దీంతో తన ఇంటికి రాజకీయ నేతలు రావద్దంటూ బ్యానర్ ఏర్పాటు చేశాడు. ఎన్నికల నేపథ్యంలో ఈ విషయం చర్చనీయాంశంగా మారింది.

హోసూరు వార్తలు..

చెన్నవీరభద్రస్వామి జాతర



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

కెలమంగలం: డెంకణీకోట తాలూకా తళి సమీపంలోని శివనపల్లి గ్రామం వద్ద వెలసిన శ్రీ చెన్నవీరభద్రస్వామి ఆలయ జాతర గత రెండు రోజులుగా వైభవంగా జరిగింది. తళి సమీపంలోని శివనపల్లి, గట్టుబిస, భీమసంద్రం మధ్యలో ఉనన చెన్నవీరభద్రస్వామి ఆలయం జాతర ఏటా ఘనంగా జరుగుతుంది. 6వ తేదీ సాయంత్రం అగ్నిగుండ మహోత్సవంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. 7వ తేదీ ఆలయంలోని మూలవిరాట్‌ను అభిషేకించి అలంకరించారు. ఈ జాతరలో స్వామివారి నృత్య ప్రదర్శనతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. శుక్రవారం రాత్రి గ్రామస్తులచే దీపారాధన, పల్లక్కీ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. హోసూరు, డెంకణీకోట, తళి తదితర చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

కారు ఢీకొని కార్మికుడు మృతి

క్రిష్ణగిరి: నడిచి వెళ్తున్న కార్మికునిపై కారు దూసుకెళ్లడంతో దుర్మరణం చెందిన ఘటన మత్తూరు వద్ద జరిగింది. వివరాలు.. తిరువణ్ణామలై జిల్లా పులియంబట్టి గ్రామానికి చెందిన చెన్నక్రిష్ణన్ కొడుకు మాధవన్ (19) భవన నిర్మాణ కార్మికునిగా పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి తిరువణ్ణామలై– బెంగళూరు రోడ్డు అందేరిపట్టి వద్ద నడిచి వెళ్లుతుండగా ఆ మార్గంలో వెళ్లిన కారు ఢీకొనింది. ప్రమాదంలో తీవ్ర గాయాలేర్పడిన బాధితుడుఽ అక్కడే మరణించాడు. మత్తూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

సాయం చేయరూ ప్లీజ్



ఆస్పత్రిలో బాలుడు

క్రిష్ణగిరి: చెంగుచెంగున గెంతుతూ ఆడుకోవాల్సిన పసిప్రాయంలో ప్రాణాంతక వ్యాధి సోకింది. దీంతో బాలుడు జీవచ్ఛవంలా బతుకీడుస్తున్నాడు. వివరాలు.. క్రిష్ణగిరి జిల్లా వేపనపల్లి సమీపంలోని నాచికుప్పం పంచాయతీ కత్తిరిపల్లి గ్రామానికి చెందిన వేణు కొడుకు ప్రశాంత్ (17)కు తరచూ జ్వరం వస్తూ బలహీనంగా మారడంతో వైద్యులకు చూపించారు. అతని రెండు మూత్రపిండాలు పనిచేయడం లేదని వైద్యులు నిర్ధారించారు. కూలి పనులు చేస్తూ జీవించే తల్లిదండ్రులకు ఇది పిడుగుపాటులా మారింది. బాలునికి వారానికి రెండు రోజులు డయాలసిస్ చేయించాలి. రోజూ ఖరీదైన మందులు వాడాలి. బాలుని వైద్య చికిత్సలకు ఏమాత్రం శక్తి లేదని, ప్రజాప్రతినిధులు గాని, సేవాసంస్థలు, మనసున్నవారు ఆర్థికంగా సాయం చేయాలని బాలుని తండ్రి వేణు అర్థించాడు.

అగ్ని ప్రమాదంలో మహిళ మృతి

క్రిష్ణగిరి: కిరోసిన్ స్టౌపై వంట చేస్తుండగా నిప్పంటుకొని చికిత్స పొందుతున్న మహిళ మరణించింది. వివరాలు.. క్రిష్ణగిరి పాతపేటకు చెందిన రామస్వామి భార్య మాదమ్మ (55) గత నెల 24వ తేదీ వంట చేస్తుండగా చీరకు నిప్పంటుకొంది. ఆమె కేకలు వేయడంతో స్థానికులు ఘటనా స్థలానికి చేరుకొని మంటలార్పి క్రిష్ణగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం బెంగళూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఫలితం లేక శుక్రవారం రాత్రి మృతి చెందింది.

లారీ డ్రైవర్‌కు తీవ్రగాయాలు

కందికుప్పం వద్ద ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి మరో లారీ ఢీకొంది. లారీ ముందు భాగం నుజ్జు కాగా డ్రైవర్ రాజేంద్రన్ (58) ఇరుక్కుపోయాడు. స్థానికులు బర్గూరు ఫైర్ సిబ్బందికి సమాచారం అందజేయగా వారు వచ్చి ఇరుక్కుపోయిన లారీ డ్రైవర్‌ను బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు.

మద్యం మత్తులో భార్యపై దాడి

హోసూరు: మద్యం మత్తులో భార్యపై దాడి చేసిన భర్తను రాయకోట పోలీసులు అరెస్ట్ చేశారు. మల్లనాంబట్టి గ్రామానికి చెందిన కూలికార్మికుడు రాజ(45). ఇతని భార్య మురుగమ్మ(40). తాగుడుకు బానిసైన రాజ రోజూ మద్యం మత్తులో భార్యతో గొడవపడేవాడు. శుక్రవారం రాత్రి అతిగా మద్యం తాగి భార్యపై దాడి చేశాడు. తీవ్ర గాయాలేర్పడిన మురుగమ్మను స్థానికులు చికిత్స కోసం క్రిష్ణగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రాయకోట పోలీసులు కేసు నమోదు చేశారు.

రేషన్ షాపు ప్రారంభం

హోసూరు: క్రిష్ణగిరి జిల్లా వేపనపల్లి నియోజకవర్గంలోని తోటకణవాయ్ గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసిన పార్ట్ టైం రేషన్ షాపును జిల్లా కలెక్టర్ దీపక్ జేకప్ ప్రారంభించారు. గ్రామంలో 134 రేషన్ కార్డులుండగా ప్రజలు రేషన్ సరకుల కోసం 8 కిలో మీటర్ల దూరంలోని సిగరమాకనపల్లికి వెళ్లాల్సి వచ్చేది. గ్రామంలో పార్ట్ టైం రేషన్ దుకాణాన్ని ఏర్పాటు చేయాలని కోరడంతో షాపును ఏర్పాటు చేశారు. అధికారులు సుకుమార్, ఏకాంబరం, కుమార్, రమేష్, కల్పన తదితరులు పాల్గొన్నారు.

కాలభైరవేశ్వర సన్నిధిలో ఐఏఎస్ సింధూరి పూజలు



బసవణ్ణ పాదాలను తాకి ఆశీర్వాదం తీసుకుంటున్న దృశ్యం

మండ్య: మద్దూరు తాలూకా చిక్కరసినకెరె గ్రామంలో కొలువైన కాలభైరవేశ్వర స్వామిని ఐఏఎస్ అధికారిణి రోహిణి సింధూరి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బసవణ్ణ పాదాలను తాకి ఆశీర్వాదం తీసుకున్నారు. చిక్కరసినకెరె బసవణ్ణ పాదాలను తాకితే అనుకున్న పనులు జరుగుతాయని ఆని భక్తుల నమ్మకం.

ఓటు హక్కుపై ప్రతిజ్ఞ

చింతామణి: ప్రలోభాలకు లోనుకాకుండా నిర్భయంగా, స్వేచ్ఛగా ఓటు వేయాలని చింతామణి మునిసిపల్ అధికారులు ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. అధికారులు శనివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించి ఓటు హక్కు ఆవశ్యకతను వివరించారు. నగరసభ మేనేజర్ నజీర్‌అహమ్మద్, ఆరోగ్యాధికారి విజయకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పరారీలో ఉన్న నిందితుడి అరెస్ట్

యశవంతపుర: కోర్టు వాయిదాలకు గైర్హాజరవుతున్న నిందితుడిని సంపిగెహళ్లి పోలీసులు అరెస్ట్ చేశారు. అగ్రహార లేఔట్ 10వ క్రాస్‌లో పూజమ్మ ఆలయ సమీపంలో నివాసం ఉంటున్న మంజునాథ్ అలియాస్ మంజు అలియాస్ ఓసి మంజు(27)ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఓ కేసుకు సంబంధించి కోర్టుకు హాజరు కాకుండా కొన్ని సంవత్సరాలుగా పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు.

చాముండేశ్వరికి ఎమ్మెల్యే పూజలు



పూజల్లో పాల్గొన్న ఎం.సతీష్‌రెడ్డి

బొమ్మనహళ్లి: బొమ్మనహళ్లి ఎమ్మెల్యే ఎం.సతీష్ రెడ్డి శనివారం హొంగసంద్రలో ఉన్న శ్రీ చాముండేశ్వరి అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేసి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి బీజేపీ సాధనలను వివరించారు. ఉత్తమ పాలన కోసం మరోమారు బీజేపీని అధికారంలోకి తేవాలన్నారు. మాజీ కార్పొరేటర్ సుకంద రామచంద్ర, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

విద్యావేత్తకు సన్మానం



దేవేంద్రరెడ్డి, రవీంద్రారెడ్డిని సన్మానిస్తున్న మాల్యాద్రి బొగ్గవరపు

బనశంకరి: బెంగళూరునగరంలోని డీఆర్ అకాడమి అధ్యక్షుడు, విద్యావేత్త దేవేంద్రరెడ్డిని శుక్రవారం కర్ణాటక తెలుగు రచయితల సమాఖ్య ఘనంగా సత్కరించింది. ఇటీవల నిర్వహించిన ఉగాది జాతీయ పురస్కారాలను విజయవంతంగా చేపట్టేందుకు దేవేంద్రరెడ్డి సహకరించారని సమాఖ్య అధ్యక్షుడు మాల్యాద్రి బొగ్గవరపు తెలిపారు. అనంతరం శివాజీనగర ఓపీహెచ్‌రోడ్డు తెలుగు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు రవీంద్రారెడ్డిని సత్కరించారు.


బెట్టదమ్మ గుడిలో పూజలు



పుట్టకు పాలాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

హోసూరు: హోసూరు సమీపంలోని కళుగొండపల్లి వద్ద వెలసిన గ్రామదేవత బెట్టదమ్మ ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. కళుగొండపల్లి, చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు పాలకుండలతో ఆలయం వద్దకు చేరుకొని చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆలయం వద్దనున్న పుట్టకు విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించి ఊరేగించారు.

దర్గాలో ఎమ్మెల్యే ప్రార్థనలు



చింతామణి: తాలూకాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మురగమల్లా అమ్మాజాన్ బావాజాన్ దర్గాను ఆదివారం ఎమ్మెల్యే కృష్ణారెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ప్రార్థనలు జరిపారు. అంతకుముందు ముస్లింలు ఆయనకు ఘన స్వాగతం పలికారు.

ఎన్నికల ప్రచారం



బొమ్మనహళ్లి : బొమ్మనహళ్లి నుంచి కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్న సినీ నిర్మాత ఉమాపతి శ్రీనివాస్ గౌడ శనివారం హెచ్‌ఎస్‌ఆర్ లేఔట్ వార్డు ఆగరలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజలను కలిసి ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని కోరారు.



ఓటర్లతో ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం


పార్వతీపురం మన్యం జిల్లా అరసాడలో సంక్షేమ పాలనపై వృద్ధురాలి అభిప్రాయం సేకరిస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు


శ్రీకాకుళం జిల్లా కొత్తూరు గ్రామంలో సీఎం స్టిక్కర్‌ను ముద్దు పెట్టుకుంటున్న వృద్ధురాలు కుమ్మరి చిన్నమ్మి. చిత్రంలో ఎమ్మెల్యే రెడ్డి శాంతి


రాజమహేంద్రవరం రూరల్ మండలం కొంతమూరు గ్రామంలో జగనన్న స్టిక్కర్ వద్ద ప్రార్థన చేస్తున్న ముస్లిం కుటుంబం


విశాఖలోని సెబాస్టియన్ కాలనీలో ఓ ఇంటికి స్టిక్కర్ అతికిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి


ఎన్టీఆర్ జిల్లా వెలదికొత్తపాలెంలో ఇంటి గోడకు మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్ అంటిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు


బాపట్ల జిల్లా గాజుల్లంకలో 'జగనన్నే మా భవిష్యత్తు' మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్ అంటిస్తున్న మంత్రి మేరుగు నాగార్జున


ప్రకాశం జిల్లా పామూరులో ప్రజలతో మాట్లాడుతున్న కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్


శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కొత్తూరులో ఓ ఇంటి గోడకు స్టిక్కరు అతికిస్తున్న ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి


తిరుపతి జిల్లా వెండ్లూరుపాడు గ్రామంలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

అవినీతి, కుటుంబ పాలన!

▶ మొదటి పేజీ తరువాయి

